## జీవిత సభ్యతం

### 2012 జనవరి – ఫిబ్రవరి నెలలో పంపిన వారి వివరాలు

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | ఫిబ్రవరి, 12 | జి.రామారావు, మల్కిపురం, | రూ. 500.00 |
| 2. | ఫిబ్రవరి, 12 | డి. శ్రీనివాస్, సిరిసిల్ల, | రూ. 500.00 |
| 3. | ఫిబ్రవరి, 12 | ఎన్. నరసింహా స్వామి, జమ్మికుంట, కరీంనగర్ | రూ. 500.00 |
| 4. | ఫిబ్రవరి, 12 | మందా రమ, విశాఖపట్నం | రూ. 500.00 |
| 5. | ఫిబ్రవరి, 12 | రాఘవేంద్ర ప్రసాద్, కర్ణాటక | రూ. 500.00 |
| 6. | ఫిబ్రవరి, 12 | జి. విఠల్, సిద్ధిపేట్ | రూ. 500.00 |
| 7. | ఫిబ్రవరి, 12 | జె.వి. నరసింగరావు, బొల్లారం | రూ. 500.00 |
| 8. | ఫిబ్రవరి, 12 | వై. సంతోష్ కుమార్, కామారెడ్డి | రూ. 1000.00 |
| 9. | ఫిబ్రవరి, 12 | హెచ్.బి. రాధా స్వామి, గుంతకల్ | రూ. 1000.00 |
| 10. | ఫిబ్రవరి, 12 | డి. ఉమాదేవి, విజయవాడ | రూ. 1000.00 |
| 11. | ఫిబ్రవరి, 12 | వై. శ్రీనివాస కుమార్, సింధనూర్ | రూ. 1000.00 |
| 12. | ఫిబ్రవరి, 12 | కె. ప్రభాకర్ మూర్తి, విజయవాడ | రూ. 500.00 |
| 13. | ఫిబ్రవరి, 12 | ఎన్.ఎస్.నాగభూషణం, అన.పూర్ | రూ. 500.00 |
| 14. | ఫిబ్రవరి, 12 | ఎస్. శ్రీను, నెల్లిమర్ల, వి.నగరం | రూ. 1000.00 |
| 15. | ఫిబ్రవరి, 12 | వి. భైరయ్య, కామారెడ్డి, ని.బాద్ | రూ. 1000.00 |
| 16. | ఫిబ్రవరి, 12 | ఎస్.ప్రతాప్‌గుప్త, కామారెడ్డి,ని.బాద్ | రూ. 1000.00 |
| 17. | ఫిబ్రవరి, 12 | జి. శశిధర్, ధర్మవరం | రూ. 1000.00 |
| 18. | ఫిబ్రవరి, 12 | జి.కాత్యాయని,కామయ్యపాలెం,ప.గో | రూ. 1000.00 |
| 19. | ఫిబ్రవరి, 12 | బి.కె.ఎన్.మహేశ్వరరావు,హైదరాబాద్ | రూ. 500.00 |
| 20. | ఫిబ్రవరి, 12 | టి.ఎ.నారాయణ, విశాఖపట్నం | రూ. 700.00 |
| 21. | ఫిబ్రవరి, 12 | వేణుగోపాల్ రెడ్డి, బెంగుళూర్ | రూ. 1000.00 |
| 22. | ఫిబ్రవరి, 12 | పి.నిరంజన్‌బాబు, రంగారెడ్డి | రూ. 500.00 |
| | | **మొత్తం** | **రూ. 16,200.00** |

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2012-2014, **Dt.19-12-2011**

# మెహెర్‌బాబా

**అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక**

సంపుటి :11 సంచిక: 10 హైదరాబాద్ ఫిబ్రవరి 2012 పేజీలు 40

**Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-**



# మెహెర్‌బాబా సందేశం



అర్థం చేసుకున్నాను అనే విషయంలో అర్థమే లేదన్నారు బాబా.

ప్రేమించడంలో కొంత అర్థం వుందన్నారు.

విధేయత అలవరచుకోవడంలో మరికొంత అర్థం వుందన్నారు.

బాబా కొంగును కడదాకా పట్టుకోవడమే జీవితపరమార్థం కావాలన్నారు.

" Understanding has no meaning. Love has meaning. Obedience has more meaning. Holding **MY** daaman has most meaning."....-**Meher Baba.**

## హమీర్‌పూర్‌లో విశ్వ ప్రేమ మేళా

మెహెర్‌బాబా ప్రేమికుల ప్రేమను చవి చూడాలంటే హమీర్‌పూర్ వెళ్ళాల్సిందేనని మెహెర్‌బాబా స్వయంగా పేర్కొన్నారు. అవతార్ మెహెర్‌బాబా హమీర్‌పూర్ జిల్లాలో 1952లో ఇచ్చిన ప్రథమ ప్రజా దర్శన కార్యక్రమాన్ని గుర్తుచేసుకుంటూ మెహెర్‌పురి, హమీర్‌పూర్‌లో 2012 నవంబరు 17,18,19 తేదీలలో **'విశ్వ ప్రేమ మేళా'** నిర్వహిస్తున్నట్లు ఆహ్వానం పంపారు.

అలాగే, 2012 నవంబరు 20న ఇంగోటాలో, నవంబరు 21న మౌదహా, నవంబరు 22, 23లలో మహేవాలో, నవంబరు 25, 26లలో నౌరంగాలో మెహెర్ ప్రేమిక సహవాస్‌వాస్‌లు పెద్దఎత్తున ఏర్పాటుచేసిన్నట్లు ఆహ్వానంలో తెలిపారు. వీలుకుదిరితే, ముందుగా తగిన ప్రయాణ ఏర్పాట్లు చేసుకొని ప్రేమిక మేళాలో పాల్గొనగలరు.

## చదవండి! చదివించండి!!

మెహెర్‌బాబా పత్రికను మీ బంధువులకు, స్నేహితులకు బహుమతిగా అందించండి. మీ సూచనలు, సలహాలు అందించండి. పత్రిక పురోభివృద్ధికి తోడ్పడవల్సింది.





# మెహెరస్థాన్ - కొవ్వూరులో

మెహెరస్థాన్ కొవ్వూరులో 2012 ఫిబ్రవరి 28న గోల్డెన్ జూబ్లి ప్రారంభోత్సవ వేడుకల సందర్భంగా ఉ. 7 నుండి సా. 5 వరకు ప్రత్యేక ప్రేమిక సహవాస్‌ను నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీ యస్.వి. ప్రసాదరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**krishnanandm@yahoo.com**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
**040-65699611**

## లోపలి పేజీలలో...


| | | |
|---|---|---|
| 1. | సంపాదకీయం | 5 |
| 2. | 43వ అమరతిథి | 6-14 |
| 3. | భావూజీ స్వాగతోపన్యాసం | 15-19 |
| 4. | లార్డ్ మెహెర్ | 20-24 |
| 5. | కృష్ణనాయర్ | 25-30 |
| 8. | కాశ్మీరీ శాలువా | 31 |
| 9. | యువతకు సందేశం | 32-33 |
| 10. | మా మాటలు | 34-37 |
| 10. | ప్రార్థనలు | 38-39 |


**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం.32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

### మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# మెహెర్ మండపేట-58 వార్షికోత్సవం

**తూర్పుగోదావరి జిల్లా మెహెర్ మండపేట అవతార్ మెహెర్‌బాబా సెంటర్ 58వ వార్షికోత్సవం 2012 మార్చి 4 ఉ. 9 నుండి 2 గంటల వరకూ పెద్ద ఎత్తున ఏర్పాటు చేసినట్లు, బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవల్సిందిగా సెంటర్ అధ్యక్షులు శ్రీ యం. వనసన్న ఒక ప్రకటనలో తెలిపారు.** 58 సంవత్సరాల క్రితం మెహెర్‌బాబా ఈ ప్రాంతాన్ని సందర్శించి పునీతం చేశారని, ఆ సందర్భంగా ప్రతి ఏటా మార్చి 4న బాబా సహవాస్ నిర్వహిస్తున్నామని శ్రీ పనసన్న పేర్కొన్నారు.

# ఏకాహం..

## మార్చి 11, 2012 ఉ. 5 నుండి

ప్రముఖ హై కోర్టు న్యాయవాది, బాబా ప్రేమికులు శ్రీ నోరి మెహెర్‌చంద్ గారి ఇంట్లో, హుమయూన్ నగర్, ఎన్.ఎం.డి.సి. ఆఫీసు వెనుక, 2012 మార్చి 11, ఉ. 5 నుండి సా. 6 గంటల దాకా మెహెర్‌బాబా ఏకనామం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అనంతరం రాత్రి 8 గంటల దాకా బాబా భజనలు, సత్సంగ్ ఏర్పాటు చేసినట్లు, బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవల్సిందిగా శ్రీ నోరి **(92465 86261)** కోరారు.

# కంకల్ 31వ వార్షికోత్సవం

కంకల్ బాబా సెంటర్ 31వ వార్షికోత్సవాన్ని 2012 మార్చి 11, ఉ. 7 నుండి మ.2 గంటల వరకు ఘనంగా జరుపుకోనున్నట్లు బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో హాజరుకావల్సిందిగా స్థానిక బాబా ప్రేమికులు కోరుతున్నారు.

మరిన్ని వివరాలకు 94901 49591, 99482 25033 సంప్రదించగలరు.

# మెహెర్ ఉమంగ్ మేళా

## 2012 జూన్ 10,11,12

ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో గల మెహెర్‌ధాం, యాకుత్ గంజ్, (ఫరూక్‌బాద్ జిల్లా)లో మెహెర్ మేళా జూన్ 10,11,12 తేదీలలో నిర్వహిస్తున్నట్లు ఆహ్వానం పంపారు.

మెహెరాబాద్ నుండి శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరీ, శ్రీ శాలిగ్రాం శర్మ తదితరులు పాల్గొంటున్నారని తెలిపారు.





## సంపాదకీయం

# త్వమేవ శరణం

ప్రస్తుతం అలభ్యమైన **'మెహెర్ శకం'** సంచికలు చిన్న కరపత్రాలు.

సుమారు 37 ఏళ్ళ క్రిందట అంటే 1975లో ఆంధ్రా మెహెర్ సాహితి (ఆలమూరు) వారు చేసిన ప్రచురణలు అవి. వాటిల్లో చెప్పుకోదగ్గది – **'మానవాళికి అవతారుని పిలుపు',** అన్న నాల్గవ సంచిక దొరికితే చదవండి.

'వ్యక్తిగత అవసరాలను తీర్చే నిమిత్తం నేను అద్భుతాలని ప్రదర్శించకపోయినా, అప్పుడప్పుడు నా అనంత శక్తిని అద్భుతాల రూపాలలో ప్రదర్శిస్తుంటాను. కానీ అది సమస్త జీవరాశుల యొక్క సర్వ మానవాళి యొక్క ఆధ్యాత్మికోన్నతి, ప్రయోజనాల నిమిత్తమే' అన్న బాబావారి మాట పదకొండవ పేజీలో కనిపిస్తుంది.

భావూ కల్చూరీ గారి 43వ అమరతిథి స్వాగతోపన్యాసం (లిఖితం) ఈ విషయాన్నే గుర్తుచేస్తోంది. సశరీరులుగా బాబావారు మన మధ్యలేకపోయినా అమరతిథికి వందలాది, వేలాది మంది దేశ దేశాల నుంచి తరలివస్తున్నారంటే, అదొక అద్భుతం కాక మరేమిటి? సమాధిలో బాబావారు ఎప్పుడూ వున్నారు. దర్శనానికి వచ్చిన వారందరికీ తమ ప్రేమాశీస్సులనిస్తున్నారు. ఆ దివ్యానుభూతి అందరి సొత్తూ కాదు. కాలేదు కూడా. సంస్కారాల బంధనాల మహిమ మరి. అలా అని మెహెరుని 'నజర్'కు ఎవ్వరూ దూరం కారు.

మరోమాట 'మెహెర్ ప్రభుని ఏమీ అడగకు' అనేవాడు అమెరికా దేశీయుడైన బాబా ప్రేమికుడు ఛార్లెస్ పుర్దం'.

ఒకవేళ అడిగావో, ఆయన చెప్పిన ప్రకారం చేయి. పిచ్చి వేషాలు వేయకు అని హెచ్చరించే వాడు. బాబా ఆజ్ఞల సాగరంలో మనం మునిగిపోవాలని పుర్దం ఓ తూరి అన్నారు.

ఇది కష్టమే.

కానీ, కష్టమైనా ఇష్టమని ఆయన కొంగు పట్టుకొన్నాక ఏంచేస్తాము.

మరో పాశ్చాత్య బాబా ప్రేమికురాలు కిట్టీ దేవి అన్నట్లు మనం చేయగలిగింది ఒక్కటే ఒక్కటి. అది బాబావారి పైనే మనస్సుని పెట్టడం.

బాబావారికి అన్నీ తెలుసు,

ఏది చేసినా మన మంచికేనని గుర్తుంచుకోవడం.

ఇదేగా త్వమేవ శరణం అంటే. ❋

# మెహెరావతారుని 43వ అమరతిథి




మెహెరావతారుని 43వ అమరతిథి జనవరి 31వ తేదీన మెహెరాబాద్ కొండపై మునుపు ఎన్నడూ లేనంత జన సందోహం మధ్య ఘనంగా జరిగింది. సుమారు 75 దేశాల నుంచి బాబా ప్రేమికులు తరలివచ్చారు. అకారాది క్రమంలో చెప్పాలంటే అర్జంటినా, అమెరికా, కెనడా, బ్రిటన్, జర్మనీ, ఇరాన్, రష్యా, చైనా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా – ఇలా అనేక దేశాలనుంచి 30వ తేదీకి ముందుగానే అనేక మంది వచ్చారు. ఇందువల్లనే బాబా వేదికపై అమరతిథినాడు ఇంగ్లీషు, తెలుగు, హిందీ, మరాఠీ భాషలతో పాటు, స్పానిష్, పార్శీ వంటి భాషల్లో కూడా ప్రభు నామజపం చెవిని పడింది.

జన్మకిదే సద్భాట, మరవకుమా సుమా అన్న హెచ్చరిక మనస్సుకి హత్తుకునేలా వినిపించింది. మూడురోజుల కార్యక్రమంలో మొత్తం 40కి పైగా భజన బృందాలు గళం విప్పి ప్రభుస్తుతి చేశారు. 17 మంది తెలుగువారు మధురమైన పాటలు వినిపించారు.





రుస్తుం సోదరులు బాబావారి కవ్వాలి **చదువుకోకపోతే ఏమయిందని** పాడి అందరినీ మైమరపించారు. పది పన్నెండు మంది చిన్నారులు ప్రభు కీర్తనలకు తగ్గట్టు పురి విప్పిన నెమళ్ళలా నాట్య ప్రదర్శన చేసి అందరినీ అలరించారు.

మొదటిరోజు అంటే జనవరి 30వ తేదీ హైలైట్ – బొంబాయి కేంద్రం వారు **'భగవదన్వేషణలో'** అనే అద్భుతంగా ప్రదర్శించారు. ఈ నాటకాన్ని గత అమరతిథిలో కూడా ఒకసారి ప్రదర్శించారు. ఐతే, అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమంటే, ఈసారి ఆ నాటకాన్ని తెరపై 'డి.వి.డి' ద్వారా చూపించారు. అనేక ఘట్టాలని ఇతివృత్తంగా తీసుకొని రూపొందించిన ఈ నాటకం బాబావారి **'ఆఖరి సహవాస్'** తో ముగిసింది.

నలభైమూడేళ్ళ క్రిందట జనవరి 31వ తేదీన మెహెరుడు అంటే తెలియనివారికీ, ఆదరిమిలా బాబా నామం విని సమాధిలో మహాదర్శనంతో సంతృప్తిపడుతున్నవారికీ బాబావారు తమ శరీర పరిత్యాగం సమయంలో ఇదిగో '**ఈవాళ నా శెలవు రోజు**' అని ఎందుకు పదే పదే అన్నారో ఈ నాటకం వల్ల తెలిసివచ్చింది. కంటతడి తెప్పించింది. తెరపై చూస్తున్న మనకే ఇంతగా గుండె కదిలినట్లు వుంటే, ఆనాడు మండలివారు





భరించారో ఊహించలేము. ఈ భావన రాగానే, అమరతిధికి వచ్చి భోజన, స్నానాదికాల విషయంలో  ఎదురవుతున్న ఇబ్బందులను పట్టించుకోబుద్ధికాదు.

వర్షాలు తక్కువగా పడటం వల్ల మెహెరాబాద్‌లో నీళ్ళ ఎద్దడి ఎక్కువగా వుంది, స్నానాలకి నీళ్ళు దొరకవు అని ట్రస్టువారు ముందే హెచ్చరించినా, 'ఆ! అన్నీ బాబాయే చూసుకొంటారులే! అంత దూరం తీసుకువెళ్ళినవాడు, కాసిన నీళ్ళు ఇప్పించలేడా స్నానానికి అనుకొంటూ వచ్చేవారే ఎక్కువ. నిత్య స్నానం అలవాటు కనుక ఓపూట స్నానం చేయకపోయినా చిరాకు చిరాకుగా వుంటుంది.

మెహెరాబాద్‌లో చలికి చలి, ఎండకి ఎండా వున్నాయి. ఉదయం 7 గంటల వరకూ స్వెట్టర్లు, మఫ్లర్లు అవసరం. ఆపైన సాయంత్రం ఐదు వరుకు వాటి జోలికి వెళ్ళాలనిపించదు.





చలికి అలవాటులేని తెలుగువారు చాలామంది స్వెట్టర్లు తెచ్చుకొన్నా, మెడలో మఫ్లరు, తలపై టోపీ పెట్టుకొన్నా, చలిబారి నుంచి తప్పించుకోలేకపోయారీసారి. ఇందుకు కారణం, కాళ్ళకి కేవలం చెప్పులే వుండటం. మెహెరాబాద్ వంటి కొండ ప్రాంతాల్లో కాళ్ళకి కూడా రక్షణ అవసరం. అంటే బూట్లు ధరించాలని కాదు. పాదాలకి చలి తగలకుండా సాక్సు వేసుకోవాలి.

ఈ వైనాన్ని ప్రేమిక లోకానికి అమరతిధి సర్క్యులర్లలో చెప్పారు. వచ్చే ఏడాది నుంచి ఈ ముందు జాగ్రత్త చర్యని అమరతిధి పిలుపులో చేరిస్తే బాగుంటుంది. మూడురోజుల అమరతిధి వేడుకల కోసం సన్నాహాలు ఐదు నెలల ముందే మొదలవుతాయి. ఎంతమంది వస్తారు, ఏ స్థాయిలో ఏర్పాట్లు చేయాలీ అన్న తర్జన భర్జనలు సెప్టెంబరులో జరిగితే, వాలంటీర్లకి పిలుపు అక్టోబరులో వెడుతుంది. ఈలోగా వాలంటీర్ల విధులు, బాధ్యతల గురించి సర్క్యులర్ పంపటమవుతుంది. భద్రత, సైలెన్స్ జోన్, క్యూ కాంప్లెక్స్, టెంట్ డ్యూటీస్, పరిశుభ్రత వంటి వివిధ విభాగాల గ్రూప్ హెడ్స్‌కి సవివరమైన జాగ్రత్తలు వెడతాయి.

ఈ కార్యక్రమాల సారధి జాల్‌రస్తూర్. 32 సంవత్సరాలబట్టి అమరతిధి ఏర్పాట్లు



చూస్తున్నా, ప్రతి సంవత్సరం కొత్తగానే వుంటుందని జాల్ అన్నారు నాతో. ప్రతి సంవత్సరం ఏదో కొత్త సంగతి, సరికొత్త మెళుకువని బాబా గుర్తుచేస్తుంటారన్నారు. మా వాలంటీర్లందరికీ ఆదర్శప్రాయులు. బాబావారు చెప్పిన సేవలో పరమార్థం అన్న మాటకి చక్కని ఉదాహరణ వీరి పనితీరు. ఇన్ని వేలమార్లు వస్తున్నా, ఏ ఒడిదుడుకులు లేకుండా సాఫీగా కార్యక్రమాల నిర్వహణ జరుగుతున్నదంటే మన కార్యకర్తలని అభినందించి తీరాలని జాల్ అన్నారు. ఆయన మాట నిజమే.

ఒక్కోసారి వాలంటీర్ల చాంధసత్వం ఇబ్బంది తెస్తుందన్నది చాలా మంది నోట విన్న మాట. నియమపాలన అవసరమే. కానీ నియమనిబద్ధతల ఔచిత్యాన్నీ, అవసరాన్నీ గమనించి నడుచుకోవాల్సిన అవసరముందన్నమాట వినిపించింది ఈసారి.

ట్రస్టు చైర్మన్ భావూ కల్చురీ గారి అనారోగ్య కారణం వల్ల, ఏటా ఆయన చేసే ట్రస్టు కార్యక్రమాల వివరణ, ట్రస్టీ మెహెర్‌నాథ్ చేశారు.

అమరతిథి ముక్తాయింపు ఉపన్యాసాన్ని కూడా ఆయనే చేశారు.

మెహెర్‌నాథ్ భావూజీ కుమారుడు. బాబా దగ్గరే, బాబా కనుసన్నల్లో పెరిగాడు. బాబా ఆజ్ఞ మేరకే వకీలయ్యాడు. మెహెర్‌నాథ్ తమ ప్రసంగంలో ఒకమాట స్పష్టం చేశారు. ఇక్కడ మెహెరాబాద్‌లో ఎవరు ఎంతగా ఏమి చేయాలనుకున్నా ఏమీ చేయలేరు. బాబావారు తమకి అవసరమైనట్లు తామే చేయించుకొంటారు అన్నాడు.

'నడిచేదీ నీవే, నడిపించేదీ నీవే', అన్న కవి మాటలని స్ఫురణచేసుకోమన్నారు. హాఫీజ్, రూమీల సూక్తులని అలవోకగా గుర్తుచేశారు. మెహెర్‌ని కొంగు విడవకుండా పట్టుకోవాలన్నారు. మన ప్రయత్నం మనసారా చేస్తే, ఆయనే చేయూతనిస్తాడన్నారు.

ఈ మాట నిజమేనన్నారు సభలోని పెద్దలుకొందరు. ఇదే మా అనుభవం అన్నారు.

ఈతూరి సభావేదిక కొత్త అందాలతో దర్శనమిచ్చింది.దశాబ్దానికి పైగా కనిపిస్తున్న బాబావారి నాట్య భంగిమ పెయింటింగ్ స్థానే రెండు కొత్త ఫోటోలు దర్శనమిచ్చాయి.

ఇవి కొత్తవి కాదు.

పాత ఫోటోలే.

అయితే అమరతిథి వేదికపైకి అవి కొత్తగా వచ్చాయి. ఒక ఫోటోలో అయితే బాబావారు కాస్తంత ఓ ప్రక్కకి నడుంవాల్చి, శేషతల్పసాయిలా కన్పించారు.

సభావేదికపైన అమర్చిన నలుపు-తెలుపు ఫోటోలో బాబావారు కాసేపు నవ్వుతున్నట్లు, కాసేపు గంభీరంగా వున్నట్లు, మరి కాసేపు ఆట పట్టిస్తున్నట్లు కన్పించారు.

ముఖ్యంగా ప్రార్థనల సమయంలో బాబావారి మోహం దేదీప్యమానంగా వెలిగింది. సభాప్రాంగణంలో వున్న ప్రతివారికీ, బాబావారు తమకేసే చూస్తున్నారన్న భావన కలిగింది. బాబావారి దర్శన కార్యక్రమాలన్నింటిలోనూ ఇదే భావన కలిగేది అని 1965లో బాబావారిని దర్శించి తరించిన ఓ ప్రేమికుడు అన్నాడు.





**31వ తేదీన 12 గంటలకు మౌనం.**

అపశృతి అనవచ్చో కాదో తెలియదు కానీ ఒక అనుకోని సంఘటన జరిగింది.

31వ తేదీన 12 గంటలకు ఎప్పటిలా మౌనం ఆరంభానికి సంకేతంగా, ఎల్.బి. థాడే మహాశయుడు 'అవతార్ మెహెర్‌బాబాకీ జై' అన్నారు. 13 నిముషాలకే సమాధివైపు నుంచి మౌన విరమణ సంకేతంగా జై జైనాదాలు వినిపించాయి. బాబావారి క్యాబిన్ ప్రక్కనుంచీ, రిట్రీట్ వైపునుంచీ వెంటనే అవతార్ మెహెర్‌బాబాకీ జై నాదం ఒక్కసారి వినిపించింది.

ఎన్నో సంవత్సరాలుగా అమరతిథి కార్యక్రమాలని నిర్వహిస్తున్న థాడే గారు ఖంగుతిన్నాడు. తప్పు అలా చేయకండి అన్నట్లు చేయి అడ్డంగా వూపాడు.

మౌనదీక్ష కానివ్వండి అని మౌనంగానే అర్థించాడు. తమకి ఎదురుగా, సభా ప్రాంగణంలో వున్న గడియారాన్ని చూపించాడు. అంతే అందరూ సర్దుకున్నారు.

మౌనంగా మౌన మూర్తికి అంజలి ఘటించారు.

12.15 నిముషాలకి అవతార్ మెహెర్‌బాబాకి జై అంటూ భక్తి శ్రద్ధలతో నమస్సుమాంజలి అర్పించారు. 'అపశృతి' తొందరపాటుకి మొబైల్ ఫోన్ కాలర్ ట్యూన్ కారణమయిందని ఆ దరిమిలా తెలిసివచ్చింది.

సమాధి దగ్గరకి రాగానే ఫోనులని సైలెంట్ మోడ్‌లో పెట్టాలని ఈ సంఘటన గుర్తుచేసింది.

మధ్యాహ్నం మూడు-నాలుగు గంటల ప్రాంతంలో భావూ కల్చురి కొండపైకి వచ్చారు. కారులో కూర్చొనే వేదికపైన జరుగుతున్న కార్యక్రమాలని తిలకించారు. రిట్రీట్ దగ్గర కారు ఆపించి, చక్రాల కుర్చీలో సమాధి దగ్గరకు వచ్చారు. కుర్చీతోనే లోపలికి వెళ్ళి బాబావారికి తమ అంజలి ఘటించారు.

నేను ట్రస్టు చైర్ మెన్‌ని. అంటే **కుర్చీ మనిషి** అని కదా!.

అందుకనే కుర్చీతో సహా లోపలికి వెళ్ళానని ఆయన చమత్కరించారు.

వృద్ధులందరూ కుర్చీతో వస్తామంటే కష్టమవుతుందనుకున్నారో ఏమో,

ఆంధ్రా రెస్టుహౌస్ వారు ఉచిత ఆటోవ్యాన్ షటిల్ సర్వీసు ఏర్పాటు చేశారు.

ఇది వయస్సులో పెద్దలందరికీ ఎంతో ఊరటనిచ్చింది.

ఐతే, ఇదేమాదిరిగా, న్యూ సైట్‌లో, న్యూ న్యూ సైట్‌లో, దిగువ మెహెరాబాద్‌లోని పలు హాస్టల్సులో బస చేసిన వయస్సురీత్యా పెద్దల సౌలభ్యం కోసం రవాణా సౌకర్యం ఏర్పాటుచేసివుంటే బాగుండేది కదా అని కొందరు అభిప్రాయపడ్డారు.

ఇది మెదడుకి మేత అన్నారు ఇంకొందరు.

అమరతిథికి ముక్తాయింపు చెప్తూ...

# అందరి దృష్టి ఆంధ్రా రెస్టు హౌసు వైపే




అమరతిథినాడు అందరి దృష్టి ఆంధ్రా రెస్టు హౌసు వైపే అనాలి. వయస్సురీత్యా పెద్దవారికి ఆంధ్రా రెస్టుహౌసు చక్కని ఆతిథ్యం ఇచ్చింది. రాబోయే రోజుల్లో ఈ అతిథి గృహానికి మరింత డిమాండు వుంటుందని, ఆ డిమాండుకు తగిన ఏర్పాట్లుకు ఇప్పటినుండే తగిన ప్రణాళికలు రూపొందించాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది అమరతిదిలో 325 మందికి రెస్టుహౌసు చక్కని ఆతిథ్యం ఇచ్చింది. పెద్దలు చాలామంది రెస్టు హౌసు నుండి ఎగువ మెహెరాబాద్‌కు, తిరిగి బాబా దర్శనం అయినాక తిరిగి రెస్టు హౌసుకు తీసుకువచ్చేలా ఆటో షటిల్ సర్వీసును కార్యదర్శి శ్రీ వై.యస్.రావు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ ఏడాది అమరతిథికి అవతారుడు తమకు కల్పించిన ప్రత్యేక అవకాశమిదని పలువురు బాబా ప్రేమికులు భావించారు. ఆటో సర్వీసు తెల్లవారుఝూమున 4 గంటల నుండి అర్థరాత్రి దాకా ప్రేమికులకు అందుబాటులో వుంది. ఏ ఇద్దరు ముగ్గురు ప్రేమికులైనా ఆటో ఎక్కి పద.. పోనీయమనగానే ఆటో డ్రైనరు విసుక్కోకుండా, పెదవి కదపకుండా వినయంగా పనిచేయడం విశేషం.

పది మందికి పైగా పట్టే ఈ పెద్ద ఆటో అమరతిథి మూడ్రోజులూ విశేష సేవలందించింది.

ఈ దఫా రెస్టు హౌసు కోసం ప్రత్యేకంగా 45 మంచాలు, పరుపులు కొనుగోలు చేశామని, ఇందుకోసం శ్రీ ఎన్. మహేశ్వరరావు లక్ష రూపాయలు, మరి ఇతర బాబా ప్రేమికులు 40 వేలు రూపాయలు విరాళంగా అందించారని కార్యదర్శి శ్రీ వై.యస్. రావు తెలిపారు. కాగా, మరో 30 మంచాలు, పరుపులు అదనంగా కొనుగోలు చేసి, రాబోయే రోజుల్లో వాటిని ప్రత్యేకంగా మహిళలకు కేటాయించాలని ప్రతిపాదించినట్లు శ్రీ రావు తెలిపారు. ఇందుకోసం బాబా ప్రేమికులు ఒక్కొక్కరు కనీసం వెయ్యి రూపాయల చొప్పున విరాళం అందించాల్సిందిగా ఆయన కోరారు.





# గణాంకాలు




43వ అమరతిథిలో 29 వేల మంది పాల్గొన్నారని ట్రస్టువారి గణాంకాలు తెలియజేస్తున్నాయి. వీరందరూ ట్రస్టువారి నిబంధనల మేరకు రిజస్టరు చేయించుకుని, తగిన నగదు డొనేషన్ రూపంలో చెల్లించినవారు.

కాగా వీరు కాకుండా సుమారు మరో 25 వేల మంది ఆరంగాం, అహ్మద్‌నగర్, పూనే తదితర సమీప ప్రాంతాలవారు బాబాను జనవరి 31న దర్శించుకుని వుంటారని స్థానిక బాబా ప్రేమికులు భావిస్తున్నారు. ముందుగా తమ రాక గురించి నమోదు చేయించుకున్నవారి చెల్లించిన డొనేషన్ల ద్వారా ట్రస్టువారికి రూ. 1,64,300– లభించిందని తెలిపారు.

అలాగే 1008 మంది వాలంటీర్లు వివిధ విధులకు హాజరయ్యారని శ్రీ మెహెర్‌చంద్ నోరి తెలిపారు.

వీరి సంఖ్య కూడా గత ఐదేళ్ళ కంటే గణనీయంగా పెరిగిందని అన్నారు.

38వ ఆమరతిథికి 600 మంది వాలంటీర్లు మాత్రమే హాజరయ్యారని, ఈ సంఖ్య క్రమేణా ప్రతి ఏడాదీ పెరుగుతోందని శ్రీ మెహెర్‌చంద్ తెలిపారు. యువత అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

ఐతే, గత ఏడాది నుండి అమరతిథికి హాజరయ్యే వాలంటీర్లు జనవరి 31న బాబావారిని దర్శించుకోరాదని, తద్వారా దూరప్రాంతాల నుండి విచ్చేసేవారికి వాలంటీర్లు అడ్డుకారాదని ట్రస్టు సభ్యులు శ్రీ జాల్ దస్తూర్ పిలుపు ఇచ్చారు. ఈ నిబంధనలు కొందరికి నచ్చ లేదని, అమరతిథినాడు బాబాను దర్శించుకోవడమే తమకు ప్రధానమని చెప్పి వారు స్వచ్ఛంద సేవకు మంగళం పాడారని తెలిసింది. వాలంటీర్లుగా యువతతోపాటు ఎనిమిది పదులు దాటిన వారు కూడా కొద్దిపాటి సంఖ్యలోనైనా హాజరయ్యారు.

ఈ విషయంలో హైదరాబాద్ బాబా ప్రేమికులు శ్రీ ఎ.ఎస్. జగన్నాథ్ గురించి ప్రత్యేకంగా పేర్కొనాలి. ఆయన 1960వ దశకం నుండీ బాబా కార్యక్రమాలన్నింటికీ, అంటే ఆయన ఎప్పుడు మెహెరాబాద్‌కు వచ్చినా ముందుగా వాలంటరీగానే హాజరవుతున్నారని ఆయన మిత్రులు చెప్పారు.

అమరతిథి రోజుల్లో ఆయన డ్యూటీ గత 43 సంవత్సరాలుగా న్యూ సైట్‌లోనేనని,

ఈ ఏడాది కూడా ఆయన న్యూ సైట్ ఇంచార్జిగా ఉన్నారని వారు అన్నారు. ఆయన ఒక్కరే కాకుండా వారి కుటుంబసభ్యులు, బంధువులు కూడా స్వచ్ఛంద సేవకులుగా గత కొన్నేళ్ళుగా క్రమం తప్పక హాజరవుతున్నారని అన్నారు. వీరు పలువురికి ఆదర్శం కావాలి. ఈ దఫా కరీంనగర్ జిల్లా తెట్టెకుంట సెంటర్‌వారు సుమారు 15 వేల మందికి పైగా ఉచితంగా భోజన ఫలహారాలు అందించామని పేర్కొన్నారు. అలాగే బందరు సెంటరు నుండి తాడేపల్లి బసవయ్యగారి కుటుంబీకులు, వాడ్రేవు రామారావు గారి కుటుంబీకులతోపాటు పలు బాబా సెంటర్లవారు విచ్చేసిన బాబా ప్రేమికులందరికీ భోజన ఏర్పాట్లు దండిగా చేశారు. ఐతే ఇన్ని ఏర్పాట్లున్నా జనవరి 31న బాబా సమాధి ప్రాంగణంలో ప్రార్ధనలు, ఆరతి అయినాక ఆంధ్రా క్యాంటీన్ కిక్కిరిసే వుంది. భోజనాల టిక్కెట్ల కోసం కూడా పొడవాటి లైన్లు కనిపించాయి.

దిగువ మెహెరాబాద్‌లో ఎగ్జిబిషన్ ఏర్పాట్లు చేశారు. బాబా పుస్తకాల ప్రచురణలు, లాకెట్లు, ఫోటోలుతో పాటు తినుబండారాల స్టాల్సు, చెరకు రసం బళ్ళుతో కళ కళలాడాయి. ఈ తినుబండారాల అంగళ్ళూ ముఖ్యంగా తెలుగువారితో కిటకిటలాడాయి. జనవరి 31 ఉదయం ఏడు గంటలకు అమరతిధి ప్రత్యేక ధుని కార్యక్రమానికి ఉదయాన్నే చలిని ఎదిరించి హాజరయిన బాబా ప్రేమికులు చాలా తక్కువే. ఆ కొద్దిమందికి కూడా ధుని వెలిగించే కార్యక్రమాన్ని ప్రశాంతంగా వీక్షించే అవకాశం, ఆ తర్వాత క్యూలో నిల్చుని ధుని దర్శన భాగ్యం కడు కష్టతరమైందని, వాలంటీర్లు తమ పాత్ర సజావుగా పాటించలేదని పలువురు సీనియర్ సిటిజన్లు తెలియజేశారు.

## అమరతిధినాడే బాబాలో ఐక్యం



ముంబాయి బాబా ప్రేమికుడు శ్రీ సూరజ్‌నాధ్ చతుర్వేది ( 87) అమరతిధి వేడుకల నడుమ మధ్యాహ్న సమయంలో ఛాతీ నప్పితో తుదిశ్వాస విడిచారు. అకస్మాత్తుగా తీవ్ర గుండెనప్పి రావడంతో స్థానిక మెహెర్ ఆసుపత్రిలో చేర్పించి వైద్యసేవలందించారు. శ్రీ చతుర్వేది బాబా ప్రేమికులు శ్రీ గులాబ్‌దాస్ పాంచాలికి ప్రియ మిత్రులు. శ్రీ గులాబ్‌జీతో అనేక బాబా సెంటర్లు పర్యటించి బాబా గురించి ప్రసంగించేవారని, ఇంగ్లీషులో బాబా ప్రేమికులుచేసే ప్రసంగాలు హిందీలో అనువదించేవారని, బాబా సేవలో పూర్తిగా తరించిన ధన్యజీవి చతుర్వేది అని పలువురు బాబా ప్రేమికులు తమ సంతాపం తెలిపారు. మెహెరాబాద్‌లోనే ఆయన ఆఖరి అంత్యక్రియలు నిర్వహించినట్లు వారి కుటుంబసభ్యులు తెలిపారు.





**43వ అమరతిధి**

# భావూజీ స్వాగతోపన్యాసం

**భావూజీ లిఖిత ప్రసంగాన్ని ఆలీ రమ్జూ చదివి వినిపించారు.**



గత ఏడాది లాగానే ఈ ఏడాది కూడా 43వ అమరతిధిలో బాబా ట్రస్టు చైర్మన్, శ్రీ భావూ కల్చూరి స్వాగతోపన్యాసం చేయలేదు. నిరుటిలా, ఈసారి కూడా ఆ బరువుని ట్రస్టు సభ్యులు, శ్రీ ఆలీ రమ్జూపైనే పెట్టారు. ట్రస్టు చైర్మనుగా, మెహెరీశుని మండలి సభ్యునిగా భావూ కల్చూరికి బాబా ప్రేమికలోకంలో ప్రముఖ స్థానం వుంది.

బాబావారి జీవితంలో ఏ రోజున ఎక్కడ ఏం చేశారో, ఏం చెప్పారో సవివరంగా, సాధికారంగా ప్రసంగాన్ని అందించిన అపర వాల్మీకీ ఆయన.

ఈ దృష్ట్యా కూడా భావూ గారి అమరతిధి స్వాగతోపన్యాసానికి ఓ విశిష్టత, ఓ ప్రత్యేకత వున్నాయి. అందుకనీ, భావూ ఉపన్యాసాన్ని యధాతథంగా కాకుండా,

ఉపన్యాస విశేషాలని పాఠకుల ముందుచుతున్నాము.

చదవండి, చదివి ఆలోచించండి.

ఆలోచించి కార్యోన్ముఖులు కండి.

మెహెర్ ప్రభువు సశరీరులుగా లేరు కదా, శరీరం వదిలిపెట్టి 43 ఏళ్ళవుతోంది కదా, అయినా దేశ విదేశాల నుంచి జనవరి 31వ తేదీకి మెహెరాబాద్ తరలివస్తున్నారు.

ఎందుకు వస్తున్నారు చెప్పగలరా? అని ప్రశ్న వేసిన భావూ తమదైన శైలిలో జవాబు తామే చెప్పారు.

అమరతిధి అంటే బాబావారు భౌతిక శరీరం వదలిపెట్టిన రోజే.

కానీ, ఈ రోజు చాలా విశిష్టమైన రోజు.

సమాధికి వచ్చిన ప్రేమికులందరికీ బాబావారు తమ ప్రేమాశీస్సులని ఇస్తారు.

ఆ దివ్యానుభూతి అందరిసొత్తూ కాదనుకోండి.

కొంతమందికి తెలుస్తుంది.

మరి కొంతమందికి ఆ వైనం తెలీదు.

ఐనా, బాబా నామస్మరణ చేస్తూ వాళ్ళందరూ సమాధికి వస్తున్నారు.

ధన్యులవుతున్నారని భావూ పేర్కొన్నారు.

సశరీలుగా బాబావారు మన మధ్య లేకపోయినా, సమాధిలో ఆయన ఎప్పుడూ వున్నారు.

ఏదో ఒక రూపంలో వుంటున్నారు.

సమాధికి వచ్చిన ప్రతివారికీ తమ ప్రేమాశీస్సులనిస్తున్నారని భావూ గారి వ్యాఖ్య.

ఆయన ఓ మాట చెప్పారు.

అది ఏమిటీ అంటే,

'మనమంతా ఒక్కటే' అన్న సత్యాన్ని అమరతిధి మనకు గుర్తుచేస్తోందని, 'రండి, అందరూ నా దగ్గరకి, మనమంతా ఒక్కటే', అని కదా అవతారుడు మనవాళ్ళకి పిలుపునిచ్చింది.

ఈ మాటనే గుర్తుచేస్తూ భావూ అంటారు కదా – ఆత్మ పరిణామ క్రమంలో ఎన్నో దశలు, స్థితులు – రాతితో మొదలుపెట్టి మనిషి స్థితికి ఎదిగాము.

ఇవన్నీ రకరకాలుగా, వేరు వేరుగా కనిపించినా మనమంతా ఒక్కటే.

మోక్షసాధన దిశగా ఆత్మ చేస్తున్న ప్రయాణంలో ఆఖరి మజిలీ మానవ జన్మ.

మరి ఈ జన్మలో మీరంతా పురాణ పురుషుడి సమాధికి వచ్చారు.

ఎంత ధన్యులో కదా మీరందరూ.

మీరెంతటి అదృష్టవంతులో తెలియకపోవచ్చీవాళ.

కానీ మీకే తెలుస్తుందా సంగతి ఎప్పటికయినా.





భావూ గారి ప్రసంగంలో ఈసారి తరచు దొర్లిన మాట 'మనమంతా ఒక్కటే'.

గత కాలంలో దివి నుండి భువికి దిగివచ్చిన దేముడికీ, ఈ యుగంలో మన మధ్యకి వచ్చిన అవతారునికీ ఒక తేడా వుంది.

గత అవతార కాలాల్లో దైవీ మానవుడు నేనే అవతారుడనని ప్రకటించ లేదు.

ఒక్క మెహెర్‌బాబానే చేశారీ ఉత్కృష్ట ప్రకటన.

ఆ కాలపు అవతారుడు, ఈ కాలపు అవతారుడు వేరని కాదు.

అవతారుడు ఎప్పుడూ ఒక్కడే.

కాలమాన పరిస్థితులకనుగుణంగా తమ విశ్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తాడు అవతార పురుషుడు.

అందుకనే ఖొరాన్‌లో మనమంతా ఒక్కటేనన్న వివరణలు ప్రవక్త ఇవ్వలేదు.

అప్పట్లో అవసరం లేదు.

కానీ మెహెర్‌బాబాగా అవతరించగానే, ప్రపంచం నలుమూలలకీ వెళ్ళి తమ సందేశం వినిపించారు.

ఏమిటి ఆ సందేశం – మనమంతా ఒక్కటేనని.



అమరతిధి నాడు భావూజీ వీల్ చైర్‌లో వచ్చి బాబాను దర్శించుకున్నారు.

మనం ముస్లిమ్‌లమనీ, యూదులమనీ, హిందువులమనీ, క్రైస్తవులమనీ, జోరాస్ట్రులమనీ మనలో భిన్నత్వం లేదు.

మనమంతా ఒక్కటే.

ఈ సందేశాన్ని మనం జీర్ణించు కోవాలి.

ఈ సందేశం మేరకు మనం నడుచుకోవాలి అని భావూ కల్చూరి తమ లిఖిత ప్రసంగంలో పదే పదే చెప్పారు.

అమర్ అంటే చావు పుట్టుకలకి అతీతమైన స్థితి.

తిధి అంటే రోజు కాబట్టి మెహెరుడు అజరామరమైన రోజుగా అమరతిధిని అభివర్ణించారాయన.

మనం ఆచరించి తరించాల్సిన ప్రభు సందేశాన్ని అమరతిధి తీసుకువస్తోందని అన్నారు.

ఆత్మ మానవజన్మ ఎత్తింది మోక్షం కోసమే.

మీరు–వారు అనే తేడా లేకుండా అందరూ, ప్రతి ఒక్కరూ మెహెరుని దగ్గరకే వెడుతున్నారు.

మెహెర్‌బాబా వారిని అంగీకరించినా, అంగీకరించక పోయినా ఫరవాలేదు.

మెహెర్ ప్రభు నిర్ధేశ మార్గంలో కదిలినా, కదలకపోయినా ఫరవాలేదు.

ఎందుకో తెలుసా?

మన మందరం చేరవలసిన గమ్యం ఒక్కటే కదా.

కాబట్టి అమరతిధికి వచ్చిన వారికీ, రావాలని తపించినా కారణాంతరాల వల్ల రాలేకపోయిన వారికీ అందరికీ జయహో! జయహో! జైజై కార్‌హో! అంటూ తమ జై బాబా చెప్పారు భావూగారు.

భావూ గారి ప్రసంగం వింటున్నప్పుడు మొదటిసారి చదివినప్పుడు ఆ తేట తేట పదాలు ఓ తాత గారి కబుర్లా అనిపించాయి.

రెండోసారి, మరోసారి చదివినప్పుడు భావూ మాటల్లో చెప్పకుండానే చెప్పిన బాబా రహస్యం దర్శనమిచ్చింది.

ఈ మాటే భావూజీతో అంటే ఆయన ఏమన్నారో తెలుసా?

ఏదో కావాలని వ్రాయను.

బాబా వ్రాయిస్తాడు.

ఆయన ఇచ్చ ప్రకారం నా కలం కదులుతుంది.

ఒకసారి వ్రాశాక ఆ సంగతి మరచి పోతాను.

అంతే అన్నారు.

**రామ్‌సింగ్ కల్చూరి, మెహెరాబాద్ నుండి.,**





# ఆంధ్రా రెస్టు హౌసు

**ఆంధ్రా రెస్టు హౌసులోని** రెండవ అంతస్తులో నిర్మించ తలపెట్టిన ఆరు కాటేజీలలో రెండు కాటేజీలు ఖాళీగా వున్నాయని, కావల్సినవారు **మరిన్ని వివరాలకు శ్రీ వై.ఎస్. రావు 09848111671 / 09011751910 లకు సంప్రదించగలరు.**

**కొవ్వూరులోని మెహెరస్థాన్ ధర్మశాల బాబా ప్రేమికులందరికీ ఎల్లవేళలా స్వాగతం పలుకోతోందని కార్యదర్శి శ్రీ వై.యస్.రావు తెలిపారు.**

# మరో క్రొత్త పుస్తకం

మెహెర్‌బాబా మాస పత్రిక తరఫున **'మెహెర్‌బాబాతో కేశవ నారాయణ్ నిగం'** అనే పుస్తకాన్ని త్వరలో ప్రచురించి బాబా ప్రేమిక పాఠకులందరికీ అవతారుని 43వ అమరతిధి నాటికి అందజేయ్యాలని చిన్న ప్రయత్నం చేశాం.

అనివార్యకారణాలవల్ల ఆ పని పూర్తికాలేదు. త్వరలో వెలువడనుంది.

కేశవ్ నారాయణ్ నిగం–హమీర్‌పూర్ జిల్లావాసి. మెహెర్‌బాబా ఆదేశాల మేరకు **My Life Story with Avatar Meher Baba** అనే గ్రంధాన్ని ఇంగ్లీషులో స్వీయ రచన చేశారు.

మెహెర్‌బాబా మాసపత్రికలో 2010 ఆగస్టు నుండి 2011 మార్చి దాకా, 8 నెలలు ధారావాహిక సీరియల్‌గా తెలుగులో అనువదించి ప్రచురించాం. అవతారుడు మెచ్చిన కేశవ్‌జీ గురించి బాబా ప్రేమికులందరూ తప్పక తెలుసుకోవాల్సి న అవసరం ఉంది.

త్వరలో ఈ ప్రచురణ అందుబాటులోకి రానుంది. అందాకా వేచి చూద్దాం.

# పత్రిక రాకపోతేనో!

మెహెర్‌బాబా పత్రికను ప్రతినెలా 19 లేదా 20 నెలలో హైదరాబాద్‌లో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీ నాటికి పత్రిక మీ ముంగిట వుంటుంది. ఐతే మీ అడ్రస్‌కు పోస్టులో పత్రిక 25 వ తేదీ తర్వాత కూడా రాకపోతే ఒకటి రెండు రోజులు వేచి చూసి మరో పత్రిక కాపీ కోసం శ్రీ వి.ఆర్.కె. శాస్త్రి, ( 9849242284),హైదరాబాద్‌ను సంప్రదించగలరు. లేదా, 995 955 3218 మొబైల్ నంబరుకు **SMS** చేయగలరు.

అలాగే మీ చిరునామాలో ఏదేని మార్పులూ–చేర్పులూ ఉంటే 995 955 3218కు **SMS** చేయగలరు. **మెహెర్‌బాబా పత్రికను ప్రతి నెలా 20వ తేదీ కల్లా** www.srimeherbaba.com **సందర్శించగలరు. మీ వార్షిక చందా సక్రమంగా చెల్లించవల్సింది.**



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ

*(గత సంచిక తరువాయి)*

బాబావారు వెంటనే ఔరంగాబాద్‌కి బయలుదేరారు.

అక్కడి నుంచి నాగపూర్‌కి వెడతామన్నారు. చీకటి పడింది, పొద్దున్నే వెళ్ళవచ్చుకదా! ఏమోమరి రాత్రి అయినా ఫరవాలేదు అంటూ కారు ఎక్కారు.

అబ్దుల్లా, ఖాన్ సాహెబ్ కూడా కదిలారు. నాసిక్ యాత్రలో వెంట వెళ్ళిన రాక్ సాహెబ్, ఆలీ ఆక్బరులను నాతో రానక్కర్లేదీ సారి. టోకాలోనే వుండండి అన్నారు.

కారు బయలుదేరింది.

నాలుగు మైళ్ళు వెళ్ళిందో లేదో చక్రం బురదలో దిగింది.

ఎంత ప్రయత్నించినా బయటపడలేదు.

ఇహ లాభంలేదు రాత్రికి ఇక్కడే ఎక్కడో తలదాచుకొని తెల్లవారాక ఏదో ఒకటి చేద్దామనుకొన్నారు.

అక్కడే దగ్గరగా ఓ నీడ వుంటే, అక్కడ పడుకొన్నారు.

ఉదయాన్నే నలుగురూ వచ్చి చేయి వేయడంతో కారు బురద నుంచి బయటపడింది.

అంతే, బాబావారన్నారు - రండి, వెనక్కిపోదామని. పదకొండు గంటలకల్లా టోకాకి వాపసువచ్చింది బాబావారి కారు.

ఈ ప్రయాణం ఎందుకు చేపట్టారు. అవతారునికి చీకటి ప్రయాణంలో సాధక బాధకాలు తెలియవా, వర్షాలు పడి రోడ్డు బురద బురదగా వుందనీ, ఎక్కడయినా బురదలో చిక్కుకుపోవచ్చనీ, ఆ దేవదేవునికి తెలియదా! ఇవన్నీ మనం - మానవ మాత్రులం వేసుకొనే ప్రశ్నలు. వ్యక్తుడు, అవ్యక్తుడు అయిన మెహెర్‌బాబా వారు అన్ని భూమికలకీ అతీతుడు.

అలానే ఈ ప్రశంనలన్నింటికీ అతీతుడు.

మన కళ్ళకి కనబడని ఎవరికో, ఎచ్చటో చేయూతనివ్వడానికో, మరేదో మహత్తర కార్యానికో ఆయన నాలుగు మైళ్ళ ప్రయాణం చేసివుండాలి.

ఆ అక్టోబరు ఐదవ తేదీ రాత్రి.

టోకా ఆశ్రమ నిర్వహణ భారాన్ని రుస్తుంకి బాబావారు అప్పగించారు. తాము





మెహెరాశ్రమం పిల్లలతో గడుపుతున్నారు. ఆ బుడతలు మంచి హుషారుగా కనిపిస్తున్నారు. సాక్షాత్తు దేవదేముడే వచ్చి వాళ్ళలో ఒక్కడై వుంటే చిన్నారులకి పట్టపగ్గాలు లేకుండా పోయినాయి. నిద్రపోవాలి కాబట్టి పడుకుంటున్నారు తప్ప సాధ్యమైనంత వరకూ బాబావారి సన్నిధిలో గడుపుతున్నారు.

వాళ్ళతో ఎంత సరదాగా వున్నా క్రమశిక్షణ విషయంలో బాబావారు రవ్వంత కూడా సడలింపు చూపరు కదా. అందుకని ఓ మూడు గంటలు నిద్రపోతున్నారు. అయితే భోజనం మాత్రం ఒంటి పొద్దే చేస్తున్నారు.

మా దేముడు ఉపవాసం వుంటుంటే, మేము రెండు పూటలా ఎలా భోజనం చేస్తామనుకొన్నారో ఏమో మరి! ఈ ఒంటి పొద్దు భోజనంతో వాళ్ళకి నీరసం వస్తున్న దాఖలా లేదు. మంచి హుషారుగా ఆరోగ్యంగా కళకళలాడుతున్నారు.

బాబావారు రోజూ ఎన్నో సృష్టి రహస్యాలని ఆ చిన్నారులకి చెప్తున్నారు.

దైవీప్రేమ, ఆధ్యాత్మిక మార్గం ప్రభువు పట్ల గురి, గురువుపట్ల విధేయత, దైవీ లీలలు - ఇలా ఎన్నో విషయాలని వాళ్ళకి అర్ధమయ్యేలా వివరిస్తున్నారు.

భగవంతునిపై మనస్సుని లగ్నంచేయమని, మనస్ఫూర్తిగా భగవన్మార్గంలో నడవమనీ హితవు చెప్తున్నారు.

స్వయంగా దేముడే దిగివచ్చి, ప్రేమ మార్గమిదే, స్వర్గ ధామానికి ఇదేదారి అని చెప్తుంటే, ప్రేమాశ్రమం పిల్లలు ఏలోకాల్లో తేలిపోయేవారో ఊహించడం మనికి కష్టం పాఠకమహాశయా.

దైవీప్రేమ మత్తులో వాళ్ళు తేలిపోయారన్నది మాత్రం స్పష్టం, సుస్పష్టం.

పిల్లలు పిల్లలే. ప్రభు సమక్షంలో బుద్ధిగా ఒదిగి ఒదిగి కూర్చొన్నా, ప్రభువు అలా కాస్త ప్రక్కకి వెళ్ళగానే, కొంటె పనులు చేసేవారు కొంతమంది కొంటె కోనంగులు.

బాబావారు వాళ్ళని మందలించేవారు కాదు. 'పిల్లలు పిల్లలేనోయ్', అనేవారేమో మరి. అక్టోబరు 7వ తేదీ సాయంత్రం ఐదింటికి బాబావారు పిల్లల్ని తీసుకొని నది ఒడ్డుకి వెళ్ళారు. దారిపొడువునా ముళ్ళకంపలు, చిన్న పెద్ద రాళ్ళు. వాటిని జాగ్రత్తగా దాటుతూ ఒడ్డు చేరారు. ఒడ్డుకి ఓ మైలుకి దూరంలో నదీమతల్లి ప్రవహిస్తోంది.

చూసేవారికి నదీ ప్రవాహంలో ఓ గంభీరత కనిపిస్తోంది.

పదిహేను – ఇరవై రోజుల క్రిందట వర్షాలకి పొంగి పొర్లి ఎంతగా బయపెట్టిందో, ఇప్పుడు అంత ప్రశాంతంగా ప్రవహిస్తోంది.

పిల్లలకి బాబావారీ సంగతిని గుర్తుచేశారు.

నదిఒడ్డుకి ఎంత జాగ్రత్తగా నడవాల్సివచ్చిందో పేర్కొన్నారు.

మనం నది దగ్గరకి రావాలనుకొన్నాము. వచ్చాము.

దారిలో కొంచెం ఇబ్బంది పడ్డాము.

అయితేనేం, ఇక్కడికి రావాలనుకోగానే వచ్చాము.

మనం ఆశ్రమంలోనే వున్నామనుకోండి, ఇక్కడికి రావటం ఎంత కష్టమో తెలిసేదికాదు. ఇక్కడ నది ఎలావున్నదీ తెలిసేదికాదు.

నీళ్ళు ఏమాత్రం వున్నాయి, లోతు ఎంతవుంది, మనకి తెలిసేదా! ఇక్కడికి వచ్చారు కాబట్టి, ఈ నీళ్ళు త్రాగారు. మేము నదికి వెళ్ళాము.

నదిలో నీళ్ళు త్రాగాము. భలే బాగున్నాయి.

మీరా సంగతి అందరికీ చెప్తారు. నదికి వెళ్ళి గ్రుక్కెడు నీళ్ళు త్రాగమని సలహా ఇస్తారు. ఆధ్యాత్మిక మార్గం కూడా ఇంతే.

ఒక్కసారి ఆ మార్గాన్ని వెదితే, ఆ ఆనందం అనుభవిస్తే, ఈ సంగతి నలుగురికీ చెప్తారు.

మీలానే అందరూ ఆ దివ్యానుభూతిని పొందాలనుకొంటారు.

ఐతే, నదిగట్టుకి రావటానికి ఎంత ఇబ్బంది పడాల్సివచ్చిందో, అంతకు వెయ్యిరెట్లు కష్టపడాలి ఈ దివ్యమార్గయానంలో. ఆ కష్టాలు చిరాకు తెప్పిస్తాయి.

విసుగు పుట్టిస్తాయి.

శరీరం, మనస్సు అలసి సొలసిపోతాయి.

ఇహ చాలు బాబు, వెనక్కి తిరిగిపోదామనిపిస్తుంది.

ఐతే, సహనం కోల్పోకూడదు. వెనక్కి తిరిగి వెళ్ళే ప్రయత్నం చేయకూడదు. ఈ దివ్య మార్గంలోకి ఒకసారి నడిచివచ్చాక, ముందుకే వెళ్ళాలి తప్ప, వెనక్కి మళ్ళరాదు. అడుగు ముందుకే పడాలి ఎప్పుడూ.

మీ ఎదురుగా కన్పిస్తున్నది నది. మరి నేనో – మహా సముద్రాన్ని మరచిపోకండి ఈసంగతి అని బాబావారు శెలవిచ్చారు.

నదిఒడ్డుకి రావటానికే పడ్డ కష్టం తెలిసివచ్చింది కాబట్టి సాగరతీరాన్ని చేరటానికి పడాల్సిన శ్రమ ఎంతో ఊహించుకోమని లీలగా చెప్పారు.

ఒడ్డున కాసేపు కూర్చొన్నారు. పిల్లలకి చాక్లెట్లు, మిఠాయి పెట్టారు. చీకటి పడుతుంటే ఆశ్రమానికి బయలుదేరారు.





అక్టోబరు ఎనిమిదవ తేదీన బాబావారొకమాటన్నారు. ప్రేమాశ్రమం పిల్లలకి ఆధ్యాత్మికోన్నతి ఇస్తానన్నారు.

తమ ధ్యాస అంతా పిల్లలపైనే అని మండలివారికి చెప్పారు.

వాళ్ళందరూ నాలో కలిసిపోయారు వాళ్ళ ఆరోగ్యం గురించి నేనే పట్టించుకోవాలన్నారు. ఈమాట ఎందుకు అన్నారంటే, బాబా నామస్మరణలో పిల్లలు రాత్రి సరిగా నిద్రపోవటంలేదు. రాత్రిఅల్లా నిద్రపోకపోతే ఆరోగ్యం పాడవుతుందికదా! ఇదీ బాబావారిపైనే భారమేనన్నమాట.

'నేనీసారి వాళ్ళని ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు త్రోస్తాను' అన్నారు.

బాబావారు నిజంగా అన్నంతపనీ చెస్తారా, చేయరా అన్న సందేహం వద్దు మీకు అన్నారు.

ఐతే నా పనికి వాళ్ళ తల్లిదండ్రులు అడ్డం వస్తారేమో? పెద్దోళ్ళు అడ్డాలు పెడితే, ఎటూ కాకుండా పోయేదీ పిల్లవాళ్ళే. ఆధ్యాత్మిక మార్గం ఆషామాషీగా వుండదు.

నవ్వులాట కానేకాదు ప్రేమాశ్రమం పిల్లలు అందరూ భగవత్ ప్రేమ సుధారసం త్రాగి పునీతులయ్యారు.

అందరూ కాకపోయినా కొంతమంది మాత్రం భగవత్ ప్రేమలో కొంత రాటు తేరారు.

అయినా ఇంకా వాళ్ళు పిల్లలే కదా, వాళ్ళని అందర్నీ ఒక్కసారి తోయలేను అంటూ, చిన్నారులకి ప్రేమ తాయిలం వెంటనే ఇచ్చేది లేదని తేల్చేశారు బాబా.

ఈమాట విన్న పురుషమండలికి, పిల్లలంటే బాబావారికి ఎంత ఇష్టమో, వాళ్ళ సుఖసంతోషాలపట్ల ఎంత శ్రద్ధవహిస్తారో మరోసారి తెలిసివచ్చింది.

అప్పట్లో బాబావారు ఎవర్నీ పగటిపూట దగ్గరకి రానివ్వటంలేదు.

ఈ నియమం పురుషమండలికీ, స్త్రీ మండలికీ వర్తిస్తోంది.

ఈ ఉభయులూ బాబావారిని కలవాలంటే సాయంత్రం వరకు వేచివుండాల్సిందే.

అక్టోబరు 9వ తేదీన కల్నల్ ఇరానీగా దుష్ప్రచారం ప్రస్తావనకు వస్తే, ఇదొక లెక్కా నాకు అన్నారు బాబా. పసలేని ప్రచారం అతగాడిది.

నన్ను బాధించదు అన్నారు.

జీసస్ క్రీస్తుకి తలదాచుకొనే గూడు లేక దేశదిమ్మరిలా జీవితాంతం తిరిగాడు.

నాకా బాధ లేదు.

జీసస్ పడ్డ కష్టాలని కొనితెచ్చుకోవాలని మాత్రం వుంది.

కల్నల్ మహాశయుడు వ్రాస్తే వ్రాయనీ, నన్ను తిడితే తిట్టనీ, ఇందువల్ల మంచి ఫలితాలే వుంటాయి అని బాబావారు శెలవిచ్చారు.

మెహెర్‌బాబా వ్యతిరేక ప్రచారాన్ని కల్నల్ ఇరానీ గారు 1928లో ఉధృతం చేశాడు.

బాబాని దుమ్మెత్తిపోస్తూ, ఇరానీలనీ, పార్శీలనీ బాబావారిపై రెచ్చగొగుతూ, పుంఖాను పుంఖాలుగా పేపర్లలో వ్రాస్తున్నాడు. వ్రాయిస్తున్నాడు.

బాబాపై దుష్ప్రచారమే తన ధ్యేయంగా పెట్టుకొన్న ఆ మహాశయుడు ఎంతగా తెగించాడంటే, తన రాతల్ని బాబావారికీ, ఆయన అనుంగు శిష్యులకీ కూడా పంపుతున్నారు.

అక్టోబరు 9వ తేదీనాటి ఉవాచ ప్రకారం, బాబావారు కల్నల్ ఇరానీ గారి తిక్క చేష్టల్ని పట్టించుకోవటంలేదన్నది స్పష్టం అయింది.

బాబావారు తమ విశ్వకార్యక్రమానికి శ్రీకారం చుట్టిన తొలిరోజుల్లో ఎందరో ఆయన సేవలో అంకితమయ్యారు.

బాబా పాదధూళిలో కలిసిపోవాలన్న తపనతో శిష్యులుగా వచ్చారు.

అలా వచ్చినవారిలో కొందరు పార్శీలు, మరికొందరు ఇరానీలు.

బాబావారు పార్శీగా పుట్టినా, పార్శీలకి ఆయన పొడ గిట్టేది కాదు.

ఇరానీలకీ ఆయనంటే పడేదికాదు.

ఈ విముఖత వెర్రితలలువేసింది.

రోజులు దొర్లుతున్న కొద్దీ వాళ్ళలో చాలామంది బాబా దారి పట్టారు.

బాబావారికి పాదాభివందనం చేశారు.

మన కల్నల్ ఇరానీ మహాశయుడు కూడా ఈ కోవకి చెందిన వ్యక్తి అని వేరే చెప్పక్కర్లేదు.

తమ విశ్వ కార్యక్రమం కోసమే బహుశా బాబావారు అతగాడిని పురిగొల్పేరేమో.

ఎందుకంటే కల్నల్ గారి ప్రచారం ఎంత తీవ్ర స్థాయికి చేరితే, అంత ఎత్తున బాబా నామవ్యాప్తి జరిగింది.

పార్శీలు, ఇరానీలే తమ చావుకి కారణమౌతారని బాబా వారొకసారి హెచ్చరించారు.

ఈ మాటకి అర్థం పార్శీలు, ఇరానీల చేతిలో బాబావారికి మృత్యువు తప్పదని కాదు.

వారి వ్యతిరేకత ఎంత తీవ్రంగా వుంటుందో తెలియజెప్పారని గమనించాలి.

ఈ వ్యతిరేకత పుణ్యమా అని, వాళ్ళలో చాలామంది బాబావారికి దగ్గరయ్యారు.

ఇదొక లీల.

ప్రత్యర్థులని పురిగొల్పడం, వాళ్ళని మరింతగా రెచ్చగొట్టడం, బాబావారికో సరదా...

బాబావారి దివ్య నాటకంలో ఓ ప్రహసనం అది.

తద్వారా, మనకి అంతుబట్టని ఆంతరంగిక కార్యక్రమాన్ని బాబావారు పార్శీలు, ఇరానీల ద్వారా నిర్వహించారు.

ఎవరినయితే తమకి మృత్యువు క్రింద బాబావారు అభివర్ణించారో, వారే, బాబావారు ఈజద్ అనబడే ఏకైక పూజ్యుడని కీర్తించారు.

సేవించి తరించారు. **(సశేషం)**





# మెహెర్‌బాబాతో కృష్ణ నాయర్



**మూలం: Tears of Joy**
**శ్రీ అన్నా ఖండాలే, మెహెరాబాద్.**
**తెలుగు సేత: మల్లాది కృష్ణానంద్.**

## అది చాలా కష్టమైన పని

అది 1941వ సంవత్సరం.

ఆ రోజుల్లో బాబాతో మేమందరం కర్నాటకలోని ధార్వాడ పట్టణంలో వున్నాం. ఆ ఊర్లో ఒక విశాలమైన బంగళాలో బాబా, స్త్రీమండలి బస చేశారు.

నీటి ఎద్దడి బాగా వుంది. చాలా దూరంలో వున్న బావి నుండి స్నానపానాలకు బిందెలతో నీళ్ళు తెచ్చే బాధ్యత నాకు, వెంకోబరావు, కాశీనాథ్‌లకు అప్పగించారు. ఐతే వీరిద్దరికీ మరొక పని అప్పగించడంతో వారిద్దరి పని కూడా నాపై పడింది. లోతైన బావి నుండి నీళ్ళు తోడుకుని గంగాళాలు నింపడం నా ఒక్కనిపై పడింది.

అలా నేను చాలా కష్టమైన పనిని ఒంటరిగా చేశాను.

ఒకరోజున ఏమైందీ నేను నీళ్ళు చేదుకురావడంలో కొంత ఆలస్యమైంది.

నాకు ఒంట్లో బాగా లేదు. నిస్సత్తువగా, నిద్రమత్తుగా వుంది.

అయినా కూడా నేను నీళ్ళు తెచ్చాను. ఐతే అలా ఆలస్యంగా రావడంతో బాబాకు కోపం వచ్చి, నన్ను చూడగానే బాబా ఒక్కసారిగా, నీ ముఖం నాకు చూపించొద్దన్నారు.

టైముకి రావాలని ఎన్నోసార్లు హెచ్చరించానన్నారు.

ఐనా నీకు గౌరవమేది. నీవొక కొండ బండరాయివన్నారు.

ఎన్ని నీళ్ళుపోసినా రాళ్ళపై మొక్కలు పెంచగలమా? అన్నారు.

మరో సందర్భంలో బాబా స్త్రీ మండలితో కలిసి వాహ్యాళికి వెళ్ళారు.

తాను తిరిగి వచ్చే వరకు స్త్రీ మండలి ఉండే బంగళా గేటు బయట కాపలా వుండమన్నారు. బంగళాలోపలికి వెళ్ళరాదని ఆజ్ఞాపించారు.

బంగళాలో ఓ నలుగురు స్త్రీలు – పనివాళ్ళున్నారు.

అందులో ఒకరు **పాము పాము** అని కేకలు వేస్తూ, గబ గబా బయటకు వచ్చారు.

నన్ను దాన్ని చంపమన్నారు.

నేను బంగళాలోకి అడుగుపెట్టనన్నాను.

ఈ విషయాన్నే బాబా-స్త్రీమండలి వారు తిరిగి రాగానే వారితో నాపై ఫిర్యాదుగా చెప్పారు.

ఎందువల్ల చంపలేదని? బాబా నన్ను ప్రశ్నించారు.

నన్ను గేటు వదిలి బంగళాలోపలికి వెళ్ళవద్దని ఆదేశించింది నీవే కదా బాబా - అని వినయంగా చెప్పాను.

బంగళాలో నిప్పు అంటుకుని తగలబడిపోతున్నా నీవు అలాగే చోద్యం చూసేవాడివా? అన్నారు బాబా.

అవునన్నాను.

నీ ఆదేశానుసారం, బంగళా గేటు దాటి అంగుళం ముందుకు కదలకుండా వుండేవాడినన్నాను.

నీవిలా చేసివుండకపోతే నేను సంతోషించేవాడినన్నారు బాబా.

నన్ను సంతోషపెట్టడానికై, ఇప్పుడెళ్ళి ఆ పాము ఎక్కడ దాక్కుందో చూసి, దాన్ని చంపివేయమన్నారు.

సుమారు 45 నిముషాల వెదుకులాట తర్వాత, కిటికీ గుండా బయటకుపోతూ ఆ పాము కనిపించింది.

ఈ విషయాన్నే సంతోషంగా బాబాతో చెప్పి వద్దామని వెళ్ళొచ్చేసరికి ఆ పాము కాస్తా ఎటో వెళ్ళిపోయింది.

బాబా కూడా - పోతే పోనీ - అన్నారు.

బాబా మండలివారికిచ్చిన ఆదేశాలేమంటే పాము కనిపించీ, కనిపించగానే తక్షణం చంపివేయమనేవారు.

నేను బాబా దగ్గర వున్న రోజుల్లో రమారమిన 101 పాముల్ని చంపాను.

ధార్వార్‌లో ఉన్న రోజుల్లోనే ఒకసారి మేముండే బంగళాలో ఓ త్రాచుపాముని చూశాను. ఆ సమయంలో నా చేతిలో కర్ర లేకపోవడంతో, పెద్ద రాయితో కొట్టి దాన్ని గాయపరిచాను. పాము చావలేదు. ఆ తర్వాత వేగంగా దగ్గర్లోని పొదల్లోకి జారిపోయింది.

ఆ రోజు బాబా దగ్గర రాత్రి కాపలా వున్నప్పుడు - బాబా నన్ను చూసి ఏం దిగులుగా వున్నానని అడిగారు.

జరిగిన పాము సంగతంతా చెప్పాను.

అది త్రాచు పామా? అని తిరిగి బాబా అడిగారు.

అవునన్నాను.

ఐతే, అది తిరిగివచ్చి, నిన్ను వేటు వేసే అవకాశాలు ఎక్కువగా వున్నాయి. జాగ్రత్తగా వుండమని బాబా హెచ్చరించారు.

భయపడ్డావా? అని బాబా అడిగారు.





లేదు బాబా అన్నాను.

ఆ మర్నాడు నా డ్యూటీ దిగుతుంటే వెళ్ళి, విశ్రాంతి తీసుకో!

ఐతే, నీవు పడుకునేముందు దోమ తెర లోనికి ఏమీ చొరబడకుండా గట్టిగా ఏర్పాట్లు చేసుకో అని బాబా పలుమార్లు నన్ను హెచ్చరించారు.

ఆరు బయట మామిడి చెట్టు క్రింద నేను పడుకునే వాడిని.

అలా పడుకున్న కొద్ది క్షణాల్లోనే నేలపై పడివున్న ఎండు ఆకుల గలగలలు వినిపించింది. గాయపడిన త్రాచు నా వైపుగా వస్తోంది.

నేను గట్టిగా - **నీలూ - విష్ణు** - అని బాబా మండలి ప్రేమికుల్ని కర్రనొకదాన్ని తీసుకురండని గట్టిగా అరిచాను.

ఆ తర్వాత - ఆ కర్రతో త్రాచుని చంపేశాను.

ముందుగా బాబా చేసిన హెచ్చరికలు నన్ను కాపాడాయి.

ఆ మర్నాడు - బాబా నాతో మాట్లాడుతూ

అదే త్రాచా? అని అడిగారు.

నేను అవునన్నాను.

## వెంకోబాతో - విషపు సర్పం

1942 అక్టోబరు నెలలో పూనే దగ్గర్లోని లోనావాలా దగ్గర బాబా బస చేశారు. నేనూ - వెంకోబరావు నైట్ డ్యూటీలో వున్నాం.

నేను బాబా గది దగ్గర వున్నాను.

వెంకోబరావు స్త్రీమండలి బంగళా దగ్గర కాపలా వున్నాడు.

వెంకోబరావు నిద్రను ఆపుకోలేక తూలుతుండేవాడు.

అతడిని బాబా చాలాసార్లు ఈ విషయంలో జాగ్రత్తగా వుండమని హెచ్చరించారు.

ఒకరోజున వెంకోబరావు నిద్రపోతున్నాడా? మెళుకువగా వున్నాడా? లేదో చూసి రమ్మనమని బాబా నన్ను పంపారు.

ఆ క్షణంలో వెంకోబరావును చూసి నేను ఎంతో భయపడ్డాను.

ఎందుకంటే, వెంకోబా గాఢ నిద్రలో వున్నాడు.

ఆతని ప్రక్కన పొడవాటి త్రాచు కాటేయడానికన్నట్లు సిద్ధంగా వుంది.

వెంటనే ఆ పాముని నా చేతి కర్రతో చంపేశాను.

ఈ చప్పుళ్ళకు ఉలిక్కిపడి వెంకోబరావు నిద్ర నుండి లేచి నిల్చున్నాడు.

ఆ క్షణంలోనే బాబా నన్ను పిలుస్తున్నట్లు చప్పట్లు కొట్టారు.

ఏమిటా శబ్దం?అని ఏమీ ఎరుగనట్లు నన్ను అడిగారు.

జరిగినదంతా బాబాకు చెప్పాను.

బాబా వెంకోబరావుని చివాట్లు పెట్టారు.

మరోసారి ఇలా జరిగితే,

నేను నిన్ను రక్షించనని మృదువుగానే

బాబా తన సహజ ధోరణిలో హెచ్చరించారు.

## పులి - మర్మమేమిటో

1943 మార్చి .

ఆ సమయంలో నేనూ, వెంకోబరావు మేమిద్దరం మెహెర్‌బాబాతో పాటు మహాబలేశ్వర్‌లో వున్నాం.

వ్యాలీ వ్యూ బంగళాలో బాబా బస చేశారు.

మేమిద్దం బాబా బస బయట రాత్రి కాపలాలో వుండేవాళ్ళం.

ఒకరోజు రాత్రి నేను కాపలాలో ఉన్నప్పుడు ఓ పెద్ద పులి మా బంగళా ఎదుట నిల్చుని వుంది. అలా దాన్ని చూడగానే నా కాళ్ళలో వణుకు పుట్టుకుంది. నేనూ తీక్షణంగా పులి కళ్ళలో కళ్ళుపెట్టి తదేకంగా చూశాను.

పులిరాజు భయంకరంగా గర్జించింది.

నా భుజాన రైఫిల్ వుంది. నా తుపాకీని తీసి గురిపెట్టి చూస్తున్న సమయంలో బాబా గదిలో నుండి నన్ను పిలుస్తున్నట్లు చప్పట్లు సంకేతాలు వచ్చాయి.

ఐనా కూడా నేను పులికేసి చూస్తూ నిల్చున్నాను. దాంతో బాబా తన గదిలో నుంచి బయటకు వచ్చారు. నన్ను మ్రింగేస్తుందా? అన్నట్లు వున్న పులిరాజాను బాబా కూడా చూశారు. పులిరాజా బాబాన చూస్తూనే ధబీమని గోడ దూకి దట్టమైన అటవీ ప్రాంతంలోకి దుమికేసింది.

షూట్ - పులి రాజా వైపు గురిపెట్టి కాల్చుమని బాబా ఆదేశించారు.

పులి వెళ్ళిన దారిలో ఎక్కుపెట్టాను షూట్ చేశాను.

తుపాకీ గుండు దగ్గర్లోని చెట్టు మొదలులో చిక్కుకు పోయింది.

నేను పిలిచిన వెంటనే ఎందుకు రాలేదని బాబా నన్ను ప్రశ్నించారు?

భయపడ్డావా? అని తిరిగి అడిగారు.

అవునని జవాబిచ్చాను.

ఏం భయపడొద్దు. ఆ పులి నిన్ను మింగగలదా?

భయమెందుకు నేనుండగా అని బాబా అభయమిచ్చారు.

అదే సమయంలో నన్ను ఏడిపిస్తున్నట్లు,

పులి కనుక నిన్ను తినేస్తే, నాకో భారం తగ్గేదని, ఛలోక్తిగా నవ్వుతూ అన్నారు.

ఆ తర్వాత,





నన్ను బాబా గదిలో విశ్రాంతి తీసుకోమన్నారు.

ఆదరిమిలా రాత్రి కాపలా ఉండే సమయంలో ఆరు బయట పార్క్ చేసి వుంచిన బస్సులో కూర్చోమని సలహా ఇచ్చారు.

## ఇద్దరు మెహెర్‌బాబాలు

ఆ రోజుల్లో నేను బాబాతో పూనే దగ్గర్లోని లోనావాలాలో వున్నాను.

బాబా ఏకాంతవాసంలో వుండగా నేను బాబా వున్న గది బయట కాపలా వున్నాను. ఈ సమయంలో ఒక పెద్ద నల్లని త్రాచుపాము నా కంటబడింది. దాన్ని కర్రతో చంపేశాను. ఆ చప్పుడికి బాబా చప్పట్లుకొట్టి తన గదిలోకి రమ్మన్నారు.

నేను చంపిన ఆ త్రాచుతో సహా బాబా ఎదుట నిల్చుని, జరిగిన సంగతంతా చెప్పాను. బాబా సంతోషించారు.

ఆ పాముకి పరిణామక్రమంలో ఉన్నత స్థానం లభిస్తుందని బాబా ప్రకటించారు.

ఆ తర్వాత మరో ఐదు నిముషాలకు బాబా మరలా తన గదిలోకి పిలిచి ఏదైనా విషయంపై నన్ను మాట్లాడమన్నారు. దాంతో నాకేమీ పాలుపోలేదు.

ఏం మాట్లాడాలో అర్థంకాలేదు.

దాంతో బాబా - నేను ఎవరో తెలుసా? అని ప్రశ్నించారు.

మెహెర్‌బాబా - అని క్లుప్తంగా జవాబిచ్చాను.

ఇప్పుడు కాదు - ఇంత క్రితం - అని బాబా అన్నారు.

నాకు తెలియదన్నాను.

బాబా తన అక్షర ఫలకంపై మేర్వాన్ - అని రాశారు.

ఆ తర్వాత సద్గురు మెహెర్‌బాబా.

ఆ తర్వాత అవతార్ మెహెర్‌బాబా.

నిజానికి ఇద్దరు మెహెర్‌బాబాలు ఉన్నారని బాబా తిరిగి నాతో అన్నారు.

అదెలాగా?

నా ఎదుట మీరు కూర్చున్నారు. నేను ఒక్క మెహెర్‌బాబాను మాత్రమే చూస్తున్నానన్నాను బాబాతో.

లేదు.

ఇద్దరు మెహెర్‌బాబాలున్నారని

కానీ, బాబా నేను ఒక్కరిని మాత్రమే చూడగల్గుతున్నానని అన్నాను.

అయితే, అలా ఆ గోడపై తదేకంగా చూడమని ఆదేశించారు.

ఆ గోడ శుభ్రంగా వెల్లవేయించి, తెల్లగా తళ తళలాడుతోంది.

అది చూసి, తిరిగి బాబాతో ఉన్నది ఉన్నట్లుగా నేను చూసింది మాత్రం వర్ణించాను.

హృదయం తెరచి చూడు అని బాబా తిరిగి అన్నారు.

నా సమాధానం తిరిగి మామూలుగానే వుండేసరికి, బాబా నా దగ్గరగా వచ్చి, నా తలపై ఒక వెంట్రుకని లాగి, మెలిపెట్టి, ఇదిగో – ఇప్పుడు – చూడు అన్నారు.

అప్పుడు – అచ్చం మెహెర్‌బాబా మాదిరి రెండో మెహెర్‌బాబా ప్రతిబింబం కనిపించింది. ఐతే ఆ ప్రతిమ చాలా కొద్ది సెకన్లు మాత్రం నా కళ్ళెదుట నిల్చింది.

చూశావా? – అని బాబా అడిగారు.

యస్.. బాబా !! చూశానన్నాను.

అప్పుడు బాబా ఇలా అన్నారు. ఎప్పుడు ఇద్దరు మెహెర్‌బాబాలుంటారు.

నేను భౌతికంగా ఈ అవతారం తీసుకున్నప్పుడు,

నా ప్రతిబింబమే **(that descends)** భువిపై దిగివచ్చింది.

నేను నిజంగా ఈ భూమ్మీదకు రాలేదు. **I am beyond - beyond God.**

కృష్ణావతారంలో కూడా కృష్ణుడిగా మీరు చూసింది నా ప్రతిబింబాన్ని మాత్రమే.

**I AM NOT THAT. I AM THE BEYOND, BEYOND GOD** అని తిరిగి బాబా వర్ణించారు.

ఐతే ఆ కాలంలో నీవు హిందువులకు రాముడిగా, కృష్ణుడిగా అవతరించావు. క్రైస్తవులకు క్రీస్తుగా, మహ్మద్‌గా మహ్మదీయులకు అవతారం తీసుకున్నావు.

ఈ యుగంలో నీవు పార్శీయులకు జొరాస్టరుగా అవతారమెత్తావా? అని అమాయకంగా బాబాని అడిగాను.

నా ఈ అవతారం ఏ కొంతమంది కోసమో కాదని బాబా స్పష్టం చేశారు.

**THIS TIME I AM THE ONE FOR ALL**

ఈ అవతార కాలంలో నేను అందరికోసం– సమస్త మానవాళి కోసం భువిపైకి వచ్చానని బాబా సుస్పష్టం చేశారు. ఈ అవతార కాలంలో నా సందేశం ఒక్కటే అదేమంటే **LOVE ME** నన్ను ప్రేమించండి !!

జప – తాపాలు అవసరం లేదు. కేవలం 'ప్రేమ'తో – అందర్నీ ప్రేమించండి అని బాబా తన సందేశమిచ్చారు.

కానీ, నిన్ను గుర్తుపెట్టుకోవాలంటే – ప్రస్తుతం ఈ శరీర ధారివై యున్నావు. నీవు ఈ శరీరం వదిలేశాకనో అని అడిగేసరికి – బాబా – క్లుప్తంగా –

**ప్రేమ –**

**బాబాను ప్రేమించడమే నిజమైన ప్రార్థన –**

**సమస్త జ్ఞానం ప్రేమలో నిమిడీకృతమై వుందని బాబా అన్నారు.**





# కాశ్మీర్ శాలువా

1930 నాటి మాట. బాబా మండలి సభ్యుడు, మెహెర్‌బాబాకు అత్యంత సన్నిహితుడైన ఏరుచ్ జెస్సావాలా తల్లి గైమాయి జెస్సావాలా చెప్పిన మాటలివి. తన సొంత తల్లి షిరీన్‌మాయి పట్ల కూడా మెహెర్‌బాబా ఎంత నిక్కచ్చిగా ఉండేవారో ఆ కాలంలో ఆమెకు సన్నిహిత స్నేహితురాలిగా ఉన్న గైమాయి చెప్పిన కథాంశమిది. అదేమంటే, బాబా ఓ ప్రాంతంలో బహిరంగ దర్శనం ఇస్తున్నారు. బాబా ప్రక్కనే తల్లి షిరీన్ మాయి కూడా వేదికపై కూర్చుని వుంది. ఆ ప్రజాదర్శన కార్యక్రమంలో బాబా భక్తులు అనేక మంది క్యూలో నిల్చుని ఒక్కొక్కరే దర్శనం చేసుకుంటున్నారు. అందులో చాలామంది తమ చేతుల్లో భక్తితో – ప్రేమతో అరటిపళ్ళు, కొబ్బరికాయలు, పూలహారాలు, మరేదో ఫలమూ – బాబా పాదాల దగ్గర ఉంచి బాబావారి ఆశీస్సులు అందుకుంటున్నారు. ఇది మన సాంప్రదాయం కదా!! ఇది ఇలా వుండగా షిరీన్‌మాయి క్యూలో నిల్చున్న ఒక భక్తుని చేతిలో కాశ్మీరీ శాలువా ధగ ధగ మెరిసిపోతుంటే చూసి ముచ్చట పడింది. తనకైతే ఆ శాలువా బాగుంటుందని మనస్సులోనే తృప్తిపడింది. దర్శన కార్యక్రమం అయిపోయాక తన కొడుకును అడిగి ఆ శాలువాని తన సొంతం చేసుకోవాలని ఉవ్విళ్ళూరిందామె. అయితే, అనుకున్నదొకటి, అయ్యింది మరొకటీను. ఆ భక్తుడు అనుకున్న రీతిలో క్యూలో వచ్చి, తనతో తీసుకొచ్చిన ఆ అందమైన కళంకారీ కాశ్మీరీ శాలువాను బాబా పాదపద్మాలపై వుంచి, వంగి భక్తితో నమస్కరించి ముందుకు సాగాడు. దర్శన కార్యక్రమం పూర్తయ్యాక ఆ శాలువాను తాను తీసుకోవాలని మరోమారు షిరీన్‌మాయి మనస్సులో అనుకుంది. అలా ఆలోచన ఆమె మనస్సులో వచ్చిన సమయంలోనే, ఆ తర్వాత క్యూలో వచ్చిన భక్తునికి, బాబా ముందుకు వంగి ఆ శాలువా తన ప్రసాదంగా అందజేశారు. షిరీన్ మాయి అవాక్కయింది. మరో మార్గం ఏముంది కనుక? ఎందరో భక్తులు ఒకరి తర్వాత మరొకరు క్యూలో వస్తుంటే, బాబా ప్రేమతో వారిపైనే తన దృష్టంతా సారించారు. ఇక ఆ ప్రజా దర్శన కార్యక్రమం పూర్తవబోతోందనగానే, షిరీన్ మాయి తన కొడుకుపై కట్టలు తెంచుకొస్తున్న కోపాన్ని ఆపుకోలేకపోయింది. ఆ కాశ్మీరీ శాలువాను నేను ఇష్టపడ్డాను. దాన్ని నాకోసం ప్రక్కన ఉంచలేక పోయావా? అని ఆమె సూటిగా ప్రశ్నిస్తూ బాబాని నిలదీసింది. బాబా బహు చమత్కారి! నాకేం తెలుసమ్మా? కాశ్మీరీ శాలువా ఏంటి? అని అసలు ఏమీ ఎరుగనట్లు తల్లిని అడిగారు. నాకు ముందుగా చెప్పకుండా... అలా శాలువా కావాలని నీ మనస్సులోనే అనుకుంటే నాకెలా తెలుస్తుందని, బాబా తన నిస్సాయతను, అమాయకత్వాన్ని అమ్మ ఎదుట ప్రదర్శించాడు. అలాంటిది ఏదో ఒక చిన్నపాటి సంకేతమేదైనా ఇవ్వొచ్చు కదా!? అలాంటిది ఏమీ లేనప్పుడు నాకెలా తెలుస్తుందన్నారు అవతారుడు, చిద్విలాసంగా!! తన కొడుకు కావాలనే ఆ మాదిరిగా చేశాడని, ఇదేమీ తనకు క్రొత్తేమీ కాదులే అని...ఆమె బాబాపై చిరు బుర్రు లాడింది. హతవిధీ!

# అవతార్ మెహెర్‌బాబా విద్యార్థులకిచ్చిన సందేశం



నేటి యువత రేపటి నేత.

ప్రతి విషయానికి చిన్న మొదలు ఉంటుంది.

చిన్న విత్తనమే చెట్టుగా పరిణతి చెందుతుంది.

చిన్నవాగు నదిగా, చిన్న బిడ్డ మనిషిగా పెరుగుతారు.

వారు జీవితంలో తాము నేర్చుకున్న పాఠాలను యువకులై వినియోగించగలిగి,వినియోగించకపోతారు.

కానీ వారు మనిషిగా పెరిగిన తర్వాత కూడా ఆధ్యాత్మిక విషయంలో అతడింకా పసివాడిగానే ఉండిపోతాడు. ప్రపంచమనే చిన్న బడి నుంచి పెరిగిన అతనికి ఆధ్యాత్మిక విషయాలను బోధించడానికి ఒక స్కూలు కావాలి. మనిషి అనేక జన్మల నుండి బాధ - సంతోషము, ఆనందము - విచారము, మంచి - చెడు, సంపద - బీదరికము అనే ద్వంద్వ భావాలనే అనుభవాల నుండి పాఠాలు నేర్చుకుంటాడు.

మనిషి తన నిజమైన ఆత్మ స్వరూపాన్ని కనుగొనుటకు సాగే ఎదుగుదల చాలా నెమ్మదిగా సాగుతుంది.

నిస్వార్థ సేవ, ప్రేమల ద్వారా పిల్ల చేష్టలైన ద్వేషము, దురాశ, కోపము





నుండి విముక్తి పొందుతాడు.

ఆధ్యాత్మిక అధ్యయనంలో ధైర్యము, మనోనిశ్చయము కలవాడు మాత్రమే అనేక స్థాయిలను దాటి జయము పొందగలరు.

చదువు సంధ్యలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు ఎలా దారి చూపుతారో, అలాగే ఇక్కడ కూడా సద్గురువు ఆధ్యాత్మిక మార్గంలో అరుదైన భగవత్తత్వానికి దారిచూపుతారు.

కొంతమందికి మాత్రమే ఆ భాగ్యం కలుగుతుంది. దాని కొరకు మీరు ఆ సద్గురువు కృపకు పాత్రులవ్వాలి. ఆయన ప్రేమను పొందుటకు అర్హతను సంపాదించాలి.

కావున మీ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఇచ్చే క్రమశిక్షణను తిరస్కరించకండి.

ప్రాథమిక క్రమశిక్షణ ఆత్మశోధనకు కావలసిన క్రమశిక్షణకు దారి చూపిస్తుంది.

ఇతరులను జయించడం కంటే మమ్ములను మీరు జయించినట్లయితే ప్రపంచాన్ని జయించినవారవుతారు.

దానికి శులభతరమైన మార్గము దేముని ప్రేమించుటయే.

మీతోటి వారిని ప్రేమించుట ద్వారా భగవంతుడ్ని ప్రేమించడం మొదలుపెట్టండి.

ప్రతి జీవిలోనూ, వస్తువులోనూ ఉన్న భగవంతుడ్ని చూడటం మొదలుపెట్టండి.

ప్రతిఫలాన్ని ఆశించకుండా దానం చేయండి.

కీర్తిని ఆశించకుండా సేవచేయండి.

భగవంతుడు అన్నింటిలోనూ, అంతటను నిండి ఉన్నాడు. అన్నింటి కన్నా ఆయన నీలోనే ఉన్నాడు.

ప్రపంచం కొరకు మీరు లేరు. మీ కొరకు ప్రపంచం ఉంది.

ఈ విషయం మనకు ఒక చక్కని చీమ కథ ద్వారా బహిర్గతమవుతుంది.

ఒక చీమ ఆకుపై తేలియాడుతూ ఒక చిన్న వాగును దాట ప్రయత్నించింది. మధ్యలో గాలి వలన ఆ ఆకు తిరగబడింది. అప్పుడు ఆ చీమ 'సాయం చేయండి ఈ ప్రపంచం అంతా మునిగిపోతుంది' అని అరవసాగింది.

అది విని ఒక కప్ప 'ఏమిటీ...? నువ్వు మునిగి పోతున్నావు కాని ఈ ప్రపంచం కాదు' అంది.

అందుకు చీమ - 'సరే అనుకో! నేను మునిగిపోయిన తర్వాత ప్రపంచంతో నాకు సంబంధం లేదు.

కాబట్టి నా వరకు నేను మునిగిపోతే నాతో ప్రపంచం కూడా మునిగినట్లే' అంది.

అలాగే మొత్తం ఉనికి అంతా నీలోనే ఉంది. నీలో ఉన్న భగవంతుణ్ణి కనుగొనాలి. దేముడిని కనుగొనడం అనేది నిజమైన కనుక్కోదగినట్టి సంపద.

నేను మిమ్ములను ఆశీర్వదిస్తున్నాను. భగవంతుడిని ప్రేమించండి. తద్వారా ఆయనను తెలుసుకోండి.

## బందరులో బాబా జన్మదినోత్సవాలు

బందరు సెంటరులో 2012 జనవరి 1 నుండి ఫిబ్రవరి 25 వరకు 56 రోజులు బాబావారి జన్మదినోత్సవాలు కడు వేడుకగా నిర్వహిస్తున్నట్లు సెంటర్ కార్యదర్శి శ్రీ మెహెర్‌బాబా ఒక ప్రకటనలో తెలిపారు.

## కాన్పూర్ బాబా సెంటర్‌లో వార్షికోత్సవం

కాన్పూర్ బాబా సెంటర్ వార్షికోత్సవం 2012 ఫిబ్రవరి 10, 11 తేదీలలో వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆహ్వానం పంపారు.

## హర్యానాలో గుర్‌గాం సెంటర్

హర్యానా రాష్ట్రంలోని గురుగాం నుండి 20 కి.మీ. దూరంలో జాతీయరహదారి నంబరు 8కు ప్రక్కన మానేశ్వర్ గ్రామంలో సుమారు 4 ఎకరాల స్థలంలో అత్యంత ఆధునిక రీతిలో బాబా సెంటర్ నిర్మాణం చేపట్టామని సెంటర్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 3 వేల మంది కూర్చునేందుకు వీలైన ఆడిటోరియం నిర్మాణం, చక్కని ప్రార్ధనా మందిరం, విశ్రాంతి భవనం తదితర ఏర్పాట్లు, ఈ భారీ నిర్మాణ ప్రాంగణంలో చోటుచేసుకున్నట్లు కార్యదర్శి శ్రీ సునీల్ కుమార్ దహియ తెలిపారు. ఆ దిశగా వెళ్ళేట్లయితే ఈ నిర్మాణాలను దర్శించండి. (0124 - 4073932) సంప్రదించండి.

## ఆలస్యంగా ప్రచురిస్తున్న సమాచారం



ముటుకూరు - అవతార్ మెహెర్‌బాబా ప్రేమికులు యాగంటి సుబ్బయ్య గారి పెద్ద కుమార్తె శ్రీమతి మెహెర్ వాణి 16.10.2011 సాయంత్రం 7.10 ని.లకు కుటుంబ సభ్యులు శ్రీ బాబా నామస్మరణ చేస్తుండగానే తుది శ్వాస విడిచారు. ఆమె చాలాసార్లు మెహెరాబాద్‌లో సమాదిదగ్గర బాబా దర్శనం చేసుకున్నారు.

## క్రొత్త పాటల పుస్తకం

శ్రీమతి శివ నాగేశ్వరి ప్రసాద్ గారి స్వీయ గేయ రచనలతో ప్రచురించిన మెహెరు ప్రభువునికి హృదయాంజలి పాటల పుస్తకాన్ని ఇటీవల కోఠి బాబా సెంటర్‌లో శ్రీ ఎ.ఎస్. జగన్నాథ్ అవిష్కరించారు. ఈ పుస్తకం ఖరీదు రూ. 10 గా నిర్ణయించినట్లు, విక్రయించగా వచ్చే ఆదాయం మొత్తం జూబ్లీ బాబా సెంటర్‌కు అందజేస్తున్నామని శ్రీమతి శివనాగేశ్వరి తెలిపారు.





# మెహెరాస్థానా భారీ నిర్మాణ ప్రతిపాదనలు

మెహెరాస్థానా హమీర్‌పూర్ జిల్లాలో మహేవా అనే చిన్న మారుమూల గ్రామంలో వుంది. మెహెర్‌బాబా ఈ గ్రామాన్ని 1952 నవంబరు 22లో తొలిసారిగా సందర్శించారు. ఇక్కడ బాబా నవంబరు 22 నుండి 24 వరకు బస చేశారు.

ఈ ప్రాంతీయుడైన బాబా ప్రేమికులు శ్రీ కేశవ్ నారాయణ్ నిగం ఆనాడు బాబా కోసం ప్రత్యేకంగా ఒక పర్ణశాల మాదిరి కుటీరం నిర్మించారు. బాబా ఈ కుటీరంలోనే బస చేశారు.

మెహెర్‌బాబా రెండవసారి హమీర్‌పూర్ జిల్లా పర్యటనలో భాగంగా మహేవా గ్రామ సందర్శన లేకపోయినా, 1954 ఫిబ్రవరి 9న మెహెరాస్థానా మహేవాలో బస చేశారు. అంతేకాదు, ఆ రోజు రాత్రి తన ప్రేమికులందర్నీ మెళుకువగా ఉండమని హెచ్చరించారు. బాబా ఫిబ్రవరి 10వ తేదీలోకి అడుగిడగానే

**అవతార్ మెహెర్‌బాబాకి జై** - అని తొలిసారిగా ఇక్కడ నుండే జయ జయ ధ్వానాలు తన ప్రేమికులచేత చేయించారు. శ్రీ కేశవ్ నారాయణ్ నిగం రాసిన మెహెర్ చాలీసాను తొలిసారిగా బాబా ఎదుట ఆలాపించి వినిపించిన ప్రాంగణం - మెహెరాస్థానా-మహేవా.

మెహెరాస్థానా ప్రాంగణం చుట్టూ ఎత్తైన వృక్షాలతో సుమారు 7 ఎకరాల విస్తీర్ణంలో వుంది. బాబా బస చేసిన పర్ణశాలకు 56 సంవత్సరాలు పైబడటంతో తక్షణం చేపట్టవల్సిన మరమ్మత్తులు అత్యవసరమయ్యాయి. అలాగే, ఈ 7 ఎకరాల ప్రాంగణాన్ని భవిష్యత్తరాలవారి కోసం అభివృద్ధిచేసి అందజేయాల్సిన అవసరాన్ని గుర్తించి, అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనలను మూడు దశలలో సుమారు కోటి రూపాయల అంచనాలతో చేపట్టినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ఒక ప్రత్యేక భవన నిర్మాణ కమిటీని ఏర్పాటు చేశినట్లు తెలిపారు.

కాగా, బాబా ప్రేమికులందరూ ఈ అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వాములు కావల్సిందిగా కోరుతూ, తగిన విరాళాలను అలహబాద్ బ్యాంకు, KABRAI Branch, Mahoba Dist, UP, IFS Code: Alla 0210266 Meher Brahma Pariwar Mererasthana (Mahewa) Trust, Meher Brahma Pariwar, Mererasthana (Mahewa) పంపవల్సిందిగా కోరారు.

మరిన్ని వివరాలకు శ్రీ బి. రామక్రిష్ణయ్య, అధ్యక్షులు, ఆంధ్ర సెంటర్, మరియు.. www.meherasthana.com సంప్రదించగలరు.

# దేవుడిచ్చిన కానుక (Gift of God)




ఆర్నవాజ్, ఎన్. దాదా చాంజీ ఆంగ్లంలో రాసిన 'Gift of God' పుస్తకాన్ని 'దేవుడిచ్చిన కానుక' శీర్షికతో బాబా ప్రేమికులు శ్రీ సి.వై. చింతామణి, విజయనగరం, తెలుగులో అనువదించి ప్రచురించారు.

బాబా ప్రేమికురాలు శ్రీమతి ఆర్నవాజ్ అవతారునితో తన అనుబంధాన్ని ఆసక్తికర అంశాలతో పొందుపరచిన అనేక సంగతులను శ్రీ చింతామణి తెలుగులో అనువదించి, తెలుగు పాఠకులకు ఒక చక్కని గ్రంధాన్ని అందజేశారు.

బాబా ప్రేమికులందరూ తప్పక చదవవల్సిన గ్రంధమిది.

అమరతిథి వేడుకలలో భాగంగా, జనవరి 31న, శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరీ, ఈ గ్రంధాన్ని లాంఛనంగా ఆవిష్కరించి బాబా ప్రేమికులకు అందజేస్తున్నట్లు ప్రకటించారు.

## పూతికపేట

విజయనగరం జిల్లా పూతికపేట గ్రామంలో ఎ.యం.బి.మెహెర్‌గిరి కేంద్రం భవనాన్ని చిన్న కొండపై అత్యంత అద్భుతంగా నిర్మాణం జరుగుతోంది. ఈ నిర్మాణంలో మెహెర్ ప్రేమికులంతా భాగస్వాములు కావాలని బాబా ప్రేమికులు సుంకరి శ్రీను మరియు నిర్మాణ కమిటీ బృందం తరపున హృదయపూర్వకంగా కోరుచున్నారు.

## భైరమంగళ

భైరమంగళ 72వ శంఖుస్థాపన వార్షికోత్సవాన్ని 2011 డిశంబరు 17న వైభవంగా జరిపినట్లు కార్యదర్శి శ్రీ వి. దేవరావు ఒక ప్రకటనలో తెలిపారు.





# పత్రిక సభ్యత్వం

1. మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- (వెయ్యి రూపాయలు). 2. రెండు దఫాలుగా కూడా రూ.500/- చొప్పున చెల్లించవచ్చు. 3. జీవిత సభ్యత్వం చెల్లింపులపై వచ్చే వడ్డీని మాత్రమే పత్రిక నిర్వహణా ఖర్చులకు వినియోగించాలి. అయితే నేటి వరకు జీవిత సభ్యత్వంపై వచ్చిన వడ్డీని కూడా అసలు మొత్తానికే జమచేయడమైనది. 4. వార్షిక సభ్యత్వం రూ.100/- పోస్టల్ మనీ ఆర్డర్ ద్వారా పంపవలిసింది. 5. బ్యాంకు డ్రాఫ్టు లేదా బ్యాంకు చెక్కు ద్వారా పంపగోరు వారు శ్రీమతి నిర్మలాదేవి, హైదరాబాద్ పేరున పంపగలరు.

## మా అడ్రస్:

**ఎడిటర్, మెహెర్‌బాబా,**
**గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32,**
**జె.జె. నగర్ కాలనీ, సికింద్రాబాద్-500087 .**
**ఫోన్:99595-53218, malladisukku@gmail.com,**
**krishnanandm@yahoo.com,**

# పత్రిక నిలుపుదల

మెహెర్‌బాబా పత్రికకు వార్షిక సభ్యత్వం గత ఏడాది నుంచి చెల్లించని వారి సంఖ్య సుమారు 200 మందికి పైగా వుంది.

కాగా 2012 ఫిబ్రవరి సంచిక నుండి సభ్యత్వం చెల్లించని వారందరికీ పత్రిక నిలిపివేయవలెనని నిర్ణయించడమైనదిగా గమనించగలరు.

# ఖమ్మం గోల్డెన్ జూబ్లీ

అవతార్ మెహెర్‌బాబా ఖమ్మం సెంటరు గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు, అంతర్జాతీయ ప్రేమిక సహవాస్ 10.08.2012 నుండి 12.08.2012 వరకు నిర్వహిస్తున్నట్లు శ్రీ ఆర్. రామచంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాల్గొనగోరు సాంస్కృతిక, పాటలు పాడు బృందములు తమ ప్రతిపాదనలను కేరాఫ్ హౌస్.నెం. 10-1-17, మామిళ్ళ గూడెం, ఖమ్మం-507 001 (98486 07718) త్వరలో పంపించవలసినదిగా కోరుతున్నారు.

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
అల్లాహ్,
ఇలాహీ,
యజ్దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.





# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము.

మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.